సోమవారం 23 ఫిబ్రవరి 2026
https://www.telugudesam.org

# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## కాంగ్రెస్ చర్య అవివేకం: పల్లా

- వివరాలు 7 లో..




భారత్ నెట్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో.. సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా సమక్షంలో భారత్ నెట్, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఎంవోయూపై సంతకాలు చేశారు. గ్రామీణ ప్రాంతాలకు ఫైబర్ ఇంటర్నెట్ లక్ష్యంగా భారత్ నెట్ ప్రాజెక్టు అమలుపై ఏపీ ప్రభుత్వం ఈ ఒప్పందం చేసుకుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. రాష్ట్రంలో డిజిటల్ సేవల విస్తరణకు భారత్ నెట్ సహకారం అందించనుంది.

# టార్గెట్.. హైస్పీడ్ నెట్

2

- ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్
- టెక్నాలజీతో పౌర సేవలు సులభతరం
- అంతర్జాతీయస్థాయి విజ్ఞానాన్ని పల్లెకు చేరేలా చూడాలి
- ఏఐ ఓ ఉపాధి మార్గంగా యువతకు నైపుణ్య శిక్షణ
- ఇన్నొవేషన్లకు ఏపీ టెస్ట్ బెడ్
- గత ప్రభుత్వం ఫైబర్‌నెట్ వ్యవస్థను నాశనం చేసింది
- రూరల్ డిజిటల్ కనెక్టివిటీపై జరిగిన ఎంవోసీలో సీఎం చంద్రబాబు
- 5 లక్షల ఇళ్లకు ఫైబర్ కనెక్షన్లు ఇచ్చే లక్ష్యంతో ఏపీలో అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్ట్
- సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సమక్షంలో ఎంవోసీ

## ఎవర్‌గ్రీన్.. డాక్ సేవక్‌లే!

- దేశానికి కీలకమైన లాజిస్టిక్స్ వ్యవస్థ అదే..
- టెక్నాలజీ పెరిగినా.. సేవక్‌ల స్థానం భర్తీ కాదు
- ఎలక్ట్రిక్ సైకిళ్లు ఇచ్చి.. మరింత ప్రోత్సహించండి
- డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే దేశంలో డబుల్ స్పీడ్
- గుంటూరులో గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో సీఎం చంద్రబాబు

3

దేశంలో అత్యంత కీలకమైన లాజిస్టిక్స్ వ్యవస్థగా డాక్ సేవక్‌లు సేవలందిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. టెక్నాలజీ పెరిగినా, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లాంటి సాంకేతికత అందు బాటులోకి వచ్చినా డాక్ సేవక్‌ల స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని సీఎం స్పష్టం చేశారు. గుంటూరులో నిర్వహించిన గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళన్‌లో కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తపాలా శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోస్ట్ మాస్టర్‌లను సన్మానించారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... "గ్రామీణ డాక్ సేవకుల సేవలు చిరస్మరణీయం. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పార్సిల్ వెళ్లాలంటే డాక్ సేవకుల వల్లే సాధ్యం. నేను చదువుకునే రోజుల్లో ఏ పని కావాలన్నా తపాలా వ్యవస్థపైనే ఆధార పడేవాళ్లం. గతంలో అతిపెద్ద కమ్యూనికేషన్ వ్యవస్థ పోస్టల్ సేవలే. పార్సిళ్లు, మనీ ఆర్డర్ల కోసం పోస్ట్‌మ్యాన్ ఎప్పుడు వస్తారా? అని ఎదురు చూసే పరిస్థితి ఉండేదని అన్నారు.



## సేద్యానికి మరింత ఊతం

- డబుల్ ఇంజిన్ సర్కారుతో వ్యవసాయాభివృద్ధి
- కేంద్రమంత్రి చౌహాన్‌తో మంత్రి అచ్చెన్నాయుడు భేటీ



5

### జగన్‌కు హిందూమతంపై గౌరవమే లేదు

- పరకామణి నుంచి కల్తీ నెయ్యి దాకా... తిరుమల పవిత్రతను దెబ్బతీసిన జగన్ పాలన
- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



- వివరాలు 4 లో..

### తిరుమల ఊసెత్తే అర్హత జగన్‌కి లేదు

- సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలని స్వామి దర్శనాన్ని మానుకున్నాడు..
- 18నెలల కాలంలో ఏ ఒక్కసారీ స్వామిని దర్శించని జగన్
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజం



- వివరాలు 4 లో..

### మిస్టర్ జగన్ రెడ్డీ.. వెంకన్నతో పెట్టుకోవద్దు

- తిరుమల విషయంలో జగన్‌రెడ్డి వైఖరి సిగ్గుచేటు
- పాలే సేకరించని సంస్థకు నెయ్యి సరఫరాకు అనుమతించారు
- ఇప్పుడు చట్ట సభల్లో స్వామి చిత్రపటాలను అవమానించారు
- పాపాలకు శిక్ష తప్పదని హెచ్చరించిన మంత్రి కొల్లు



- వివరాలు 4 లో..

# టార్గెట్.. హైస్పీడ్ నెట్




- ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్
- టెక్నాలజీతో పౌర సేవలు సులభతరం
- అంతర్జాతీయస్థాయి విజ్ఞానాన్ని పల్లెకు చేరేలా చూడాలి
- ఏఐ ఓ ఉపాధి మార్గంగా యువతకు నైపుణ్య శిక్షణ
- ఇన్నొవేషన్లకు ఏపీ టెస్ట్ బెడ్
- గత ప్రభుత్వం ఫైబర్‌నెట్ వ్యవస్థను నాశనం చేసింది
- రూరల్ డిజిటల్ కనెక్టివిటీపై జరిగిన ఎంవోసీలో సీఎం చంద్రబాబు
- 5 లక్షల ఇళ్లకు ఫైబర్ కనెక్షన్లు ఇచ్చే లక్ష్యంతో ఏపీలో అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్ట్
- సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సమక్షంలో ఎంవోసీ

అమరావతి (చైతన్య రథం): ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్టులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. టెక్నాలజీ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరవేయాలంటే ప్రతి ఇంటికీ డిజిటల్ కనెక్టివిటీ ముఖ్యమని సీఎం వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆదివారం సీఎం క్యాంప్ కార్యాలయంలో కీలక సహకార ఒప్పందం కుదిరింది. సుమారు 5 లక్షల గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లకు ఫైబర్ కనెక్షన్లు అందించే లక్ష్యంతో అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్ట్-ఏబీఎన్‌పీ అమలు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఏపీలో ఏబీఎన్‌పీ అమలుకు రూ.2,432 కోట్ల మేర నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఏబీఎన్‌పీ కోసం ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఎస్పీవీ ఏర్పాటు చేసింది. డిజిటల్ భారత్ నిధి-రాష్ట్ర ప్రభుత్వం పరస్పర అంగీకారంతో నిధులు సమకూర్చి ప్రాజెక్టు అమలు చేసేలా చర్యలు తీసుకోనున్నారు. సీఎం చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సమక్షంలో డిజిటల్ భారత్ నిధి-ఏపీ ప్రభుత్వం మధ్య వీశీజ కుదుర్చుకున్నారు. డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, రాష్ట్ర ఐ అండ్ ఐ శాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు వీశీజపై సంతకాలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ ఇన్ఫ్రా బలోపేతం, గ్రామ పంచాయతీలకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని అందించేలా సహకార ఒప్పందం చేసుకున్నారు. త్వరిగతిన అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, క్షేత్ర స్థాయి సమన్వయానికి పూర్తి సహకారం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 13,426 గ్రామ పంచాయతీల్లో ప్రాజెక్టు అమలు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. 1,692 ఫేజ్-I పంచాయతీల్లోని నెట్ వర్క్ అప్ గ్రేడ్ చేయడం, 11,254 ఫేజ్-IIలోని గ్రామాల డిజటల్ కనెక్టివిటీని పూర్తి చేయడం... ఇక కొత్తగా ఏర్పడిన 480 గ్రామ పంచాయతీలకు కనెక్టివిటీ ఇచ్చేలా చర్యలు తీసుకోవడం వంటి వాటిపై ఈ ఏబీఎన్‌పీ ప్రాజెక్టుతో పని చేయనుంది. 3,942 గ్రామాల్లో డిమాండ్ ఆధారంగా లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంచే అంశంపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. డిజిటల్ కనెక్టివిటీ ద్వారా డిజిటల్ గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈ-గవర్నెన్స్ వంటి సేవలను మరింత బలోపేతం చేసేలా ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. ఈ సహకార ఒప్పందం కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు బాండ్ విడ్త్ పెంచమని బీఎస్‌ఎన్‌ఎల్‌ను అడిగాను. పెంచిన బ్యాండ్ విడ్త్‌తో టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్సులు పెట్టేవాడిని. టెలికాం రంగంలో సంస్కరణలు తీసుకురావాలని నాటి ప్రధాని వాజ్ పేయిని కోరాను. అప్పట్లో జాతీయ స్థాయిలో కమిటీ వేస్తే టెలికాం రంగంలో సంస్కరణలు చేపట్టాలని నివేదిక ఇచ్చాం. ఆ తర్వాత దేశవ్యాప్తంగా డి-రెగ్యులేషన్ అమల్లోకి వచ్చింది. భారతదేశంలో డిజిటల్ విప్లవానికి, డిజిటల్ కనెక్టివిటీ ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చక్కగా పని చేస్తున్నారు" అని ముఖ్యమంత్రి అన్నారు.

## చక్కటి వ్యవస్థను నాశనం చేశారు...

"2014-19 మధ్య కాలంలో ఫైబర్ నెట్ వ్యవస్థను ఏర్పాటు చేశాం... కరెంట్ పోల్స్‌పై ఫైబర్ కేబుల్స్ వేసి కనెక్టివిటీ కల్పించాం. 9.78 లక్షల ఇళ్లకు ఫైబర్ నెట్ కనెక్షన్లు ఇచ్చాం. ఆ తర్వాత 2019లో వచ్చిన ప్రభుత్వం ఫైబర్ నెట్ వ్యవస్థను ఇబ్బందుల్లోకి నెట్టింది. గత ప్రభుత్వం దురుద్దేశ్యంతో చేసిన నిర్వాకం వల్ల కనెక్షన్ల సంఖ్య 3.80 లక్షలకు పడిపోయింది.. ఇప్పుడు మళ్లీ కేంద్ర సహకారంతో డిజిటల్ కనెక్టివిటీని పెంచుతాం. వికసిత్ భారత్ 2047 దిశగా అడుగులు వేయడానికి ఈ చర్యలు ఉపకరిస్తాయి. ఏఐ-క్వాంటం టెక్నాలజీలకు ప్రధాని చాలా ప్రాముఖ్యత ఇస్తున్నారు.. అందుకే ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సదస్సు నిర్వహించారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు వివిధ దేశాల నుంచి దిగ్గజ కంపెనీలకు చెందిన ప్రముఖులు వచ్చారు. గ్లోబల్ నాలెడ్జిని గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులోకి తీసుకురావాలంటే బ్యాండ్ విడ్త్ పెరగాలి...దానికి కేంద్రం సహకరిస్తోంది. డిజిటల్ కనెక్టివిటీ ఉంటే ప్రజలకు సేవలు కూడా చాలా సులువుగా అందుతాయి. వాట్సాప్ ద్వారా 900కు పైగా ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. టెక్నాలజీతో పట్టాదార్ పాస్ పుస్తకాలను ముద్రించి భద్రత కల్పిస్తున్నాం. భూ రికార్డులకు బ్లాక్ చైన్ టెక్నాలజీతో సెక్యూర్టీ కల్పిస్తున్నాం. టెక్నాలజీని అనుసంధానించి ప్రజారోగ్య రంగంలో సంజీవని ప్రాజెక్టు అమలు చేయబోతున్నాం. ఏఐ సహకారంతో విద్య, వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. వివిధ ఏఐ అప్లికేషన్లను అందుబాటులోకి తెస్తాం. ఏఐతో ఉద్యోగాలు పోవడం కాదు.. ఉద్యోగాలు క్రియేట్ అయ్యేలా యువతలో నైపుణ్యం పెంచుతున్నాం" అని సీఎం చంద్రబాబు చెప్పారు.

## నెంబర్-1 స్థానం దక్కించుకునే సత్తా బీఎస్ఎన్ఎల్‌ది

"టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో... ఇతర దేశాల కంటే భారతదేశం చాలా ముందుంది. భారతదేశంలో బ్రాండ్ న్యూ టెక్నాలజీ అందుబాటులో ఉంది. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా నేతృత్వంలో బీఎస్ఎన్ఎల్ నెంబర్-1 నెట్ వర్క్ అవుతుందనే నమ్మకం ఉంది. బీఎస్ఎన్ఎల్ సంస్థకు ఆ కెపాసిటీ ఉంది. గూగుల్ డేటా సెంటర్ ఏపీకి రాబోతోంది... విశాఖ నుంచి ఇతర దేశాలకు సబ్ సీ కేబుళ్ల ద్వారా డేటాను పంపే పరిస్థితి వస్తుంది. ఏపీలో 5 లక్షల మంది వర్క్ ఫ్రం హోం ద్వారా పని చేస్తున్నారు. పారిశ్రామిక విప్లవాన్ని భారత దేశం అందుకోలేకపోయింది.. సర్వీస్ రంగాన్ని అందుకున్నాం... అభివృద్ధి చెందుతున్నాం. ఏపీలో చాలా ప్రముఖ సంస్థలు, జీసీసీలు వస్తున్నాయి. వన్ ఫ్యామిలీ-వన్ ఏఐ ఎక్స్‌పర్ట్ అనే విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం. ఐబీఎం-టీసీఎస్-ఎల్ అండ్ టి కన్సార్షియంతో దేశంలో తొలిసారి క్వాంటం కంప్యూటర్ తెస్తున్నాం. వచ్చే రెండు మూడేళ్లల్లో క్వాంటం కంప్యూటర్లను అమరావతి నుంచి ఉత్పత్తి చేయాలని ఆలోచన చేస్తున్నాం. బ్యూరోక్రసీ కూడా ఏఐలో నైపుణ్యం పెంచుకోవాలి. టెలికాం, టెక్నాలజీ రంగంలో ఎలాంటి ప్రయోగాలు చేయాలన్నా... టెస్ట్ బెడ్‌గా ఉండేందుకు ఏపీ సిద్ధం" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫైబర్ నెట్ ఎండీ గీతాంజలి శర్మ, బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



చైతన్యరథం

# దేశానికి కీలకమైన లాజిస్టిక్స్ వ్యవస్థ డాక్ సేవక్‌లే

- టెక్నాలజీ ఎంత పెరిగినా గ్రామీణ డాక్ సేవక్‌ల స్థానం భర్తీ కాదు
- ఎలక్ట్రిక్ సైకిళ్లు ఇచ్చి వారికి మరింత సదుపాయం కల్పించాలి
- డబుల్ ఇంజన్ సర్కార్ తోనే దేశంలో డబుల్ స్పీడ్‌తో అభివృద్ధి
- గుంటూరులో గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో ముఖ్యమంత్రి చంద్రబాబు




గుంటూరు (చైతన్య రథం): దేశంలో అత్యంత కీలకమైన లాజిస్టిక్స్ వ్యవస్థగా డాక్ సేవక్‌లు సేవలందిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. టెక్నాలజీ పెరిగినా, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లాంటి సాంకేతికత అందుబాటులోకి వచ్చినా డాక్ సేవక్‌ల స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని సీఎం స్పష్టం చేశారు. గుంటూరులో నిర్వహించిన గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళన్‌లో కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తపాలా శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోస్ట్ మాస్టర్‌లను సన్మానించారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... "గ్రామీణ డాక్ సేవకుల సేవలు చిరస్మరణీయం. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పార్సిల్ వెళ్లాలంటే డాక్ సేవకుల వల్లే సాధ్యం. నేను చదువుకునే రోజుల్లో ఏ పని కావాలన్నా తపాలా వ్యవస్థపైనే ఆధార పడేవాళ్లం. గతంలో అతిపెద్ద కమ్యూనికేషన్ వ్యవస్థ పోస్టల్ సేవలే. పార్సిళ్లు, మనీ ఆర్డర్ల కోసం పోస్ట్‌మ్యాన్ ఎప్పుడు వస్తారా? అని ఎదురు చూసే పరిస్థితి. టెలీ కమ్యూనికేషన్ రంగంలో సంస్కరణలు రావాలని బలంగా కోరుకున్నాం. నేడు 4జీ సేవలు అందుబాటులోకి వచ్చినందుకు గర్వపడుతున్నాం. భారతీయ తపాలా శాఖకు ఉన్నంత నెట్‌వర్క్.. మరే దేశంలోనూ ఏ పోస్టల్ సంస్థకు లేదు. మనకు స్వాతంత్ర్యం రాక ముందునుంచే బలంగా ఉన్న వ్యవస్థల్లో భారతీయ తపాలా శాఖ ఒకటి. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పరోక్షంగా కీలక పాత్ర పోషించిన ఘనత పోస్టల్ శాఖకు ఉంది. దేశంలో 1.64 లక్షలకు పైగా పోస్టాఫీసులుంటే, అందులో 90 శాతం గ్రామాల్లోనే ఉన్నాయి. ఇందులో దాదాపు 2.7 లక్షల గ్రామీణ డాక్ సేవకులు పనిచేస్తున్నారు. మన రాష్ట్రంలో 9,100కు పైగా పోస్టాఫీసుల ద్వారా.. 17,000కు పైగా గ్రామీణ డాక్ సేవక్‌లున్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందంటే అందుకు డాక్ సేవకులే కారణం. 33 శాతంమేర డీబీటీ ద్వారా ఆర్థిక సాయం డాక్ సేవకుల ద్వారానే జరడం అభినందనీయం. బ్యాంకింగ్ సేవలు, బీమా సేవలు, డీబీటీ అనుసంధాన సేవలు, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు డాక్ సేవకుల ద్వారానే అందుతున్నాయి. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనకు డాక్ సేవకులు వెన్నెముక" అని సీఎం చంద్రబాబు అన్నారు.



## డాక్ సేవకులకు ఎలక్ట్రికల్ సైకిళ్లు

డాక్ సేవకుల గౌరవం పెంచేలా కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా పనిచేస్తున్నారు. జ్యోతిరాదిత్య తండ్రి మాధవరావ్ సింధియాతో నేను కలిసి పని చేశాను. విశాఖలోని గాజువాకలో ఒక ప్రాంతానికి సింధియా పేరుంది. త్వరలోనే ఆ ప్రాంతాన్ని జ్యోతిరాదిత్య సందర్శించాలని కోరుతున్నాను. టెక్నాలజీ ఎంత పెరిగినా మానవత్వంతో పని చేసిది డాక్ సేవకులే. వారికోసం కేంద్ర మంత్రి డ్రెస్ కోడ్‌ను డిజైన్ చేశారు. డాక్ సేవకులకు ఎలక్ట్రికల్ సైకిళ్లు కూడా ఇవ్వాలని ఈ సందర్భంగా కేంద్రమంత్రిని కోరుతున్నాను. దీనివల్ల పొల్యూషన్ బెడద ఉండదు. డాక్ సేవక్‌లు విధులు నిర్వహించటంలోనూ చక్కగా ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.



## డబుల్ ఇంజన్ సర్కార్‌తో డబుల్ స్పీడ్‌లో అభివృద్ధి

"నేను ఆనాడు టెక్నాలజీని ప్రమోట్ చేశాను. నేను రూపొందించిన విజన్ కారణంగా దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణ నుంచి వస్తోంది. 2047నాటికి మన దేశం నెంబర్ వన్‌గా ఉండాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ పనిచేస్తున్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారుతో డబుల్ స్పీడ్‌లో అభివృద్ధి జరుగుతోంది. 20 నెలల్లో సంక్షేమం అందించాం. అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నాం. సుపరిపాలనకు నాంది పలికాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలను పౌరుల ఇంటి వద్దకే అందిస్తున్నాం. గత పాలకులు అమరావతిని స్మశానం, ఎడారి అన్నారు. దేవతల రాజధాని అమరావతి. ప్రపంచం మెచ్చేలా రాజధానిని నిర్మిస్తాం. గడిచిన ఐదేళ్లలో పోలవరాన్ని గోదావరిలో కలిపేశారు. 2027 గోదావరి పుష్కరాలకంటే ముందే గోదావరిని పూర్తి చేసి జాతికి అంకితమిస్తాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా లాభాలబాట పట్టించాం. జనవరిలో రూ. 54 కోట్ల లాభాలు ఆర్జించేందుకు ఎన్డీఏ పాలన సామర్థ్యమే కారణం. ఢిల్లీలో జరిగిన ఏఐ సదస్సుకు 80 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో మన దేశ నూతన ఆవిష్కరణలు చూసి వారంతా ఆశ్చర్యపోయారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో మంచి కార్యక్రమం నిర్వహిస్తే దేశ పరువు తీసే విధంగా కాంగ్రెస్ అర్ధనగ్న ప్రదర్శనలు చేసింది. వారికి ఏఐ తెలీదు. టెక్నాలజీపై అవగాహన లేదు. బ్రాండ్ దెబ్బతీసేలా వ్యవహరించడం మంచి పద్ధతి కాదు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు హితవు పలికారు.













# జగన్‌కు హిందూమతంపై గౌరవమే లేదు

- పరకామణి నుంచి కల్తీ నెయ్యి దాకా... తిరుమల పవిత్రతను దెబ్బతీసిన జగన్ పాలన
- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం (చైతన్య రథం): దేవుడంటే భక్తి లేదు... హిందువుల మనోభావాలంటే గౌరవం లేదు... అధికారంలో ఉన్నప్పుడు హిందూ ధర్మాన్ని అవమానించి, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడినే వాడుకుంటున్నది జగన్ రెడ్డి ముఠా అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తీవ్రంగా విమర్శించారు. జగన్‌మోహన్ రెడ్డి డైరెక్షన్‌లో దేవదేవుడిని కూడా రాజకీయాలకు వాడుకునే స్థాయికి వైసీపీ నేతలు దిగజారారని మండిపడ్డారు.

### దేవదేవుడినే రాజకీయాలకు వాడుకున్న నీచ ధోరణి

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ఫోటోలను చెప్పులు, షూలు వేసుకుని పట్టుకుని నినాదాలు చేస్తూ శాసనసభల్లోకి వెళ్లడం దేవుడిపై గౌరవం లేకపోవడమేనన్నారు. శ్రీవారి ఆలయంలో నామస్మరణ మాత్రమే వినిపించాల్సిన పవిత్ర ప్రదేశంలో "జగన్ రెడ్డి రక్షక గోవింద" అంటూ నినాదాలు చేయించడం హిందూ భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందన్నారు. శ్రీవారు నడయాడిన మాడవీధుల్లో చెప్పులతో తిరగడం ద్వారా జగన్ తన నిర్లక్ష్యాన్ని చాటుకున్నాడని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు చట్టసభలను బూతులు, వెకిలివేషాల కేంద్రాలుగా మార్చిన వైసీపీ నేతలు, ఇప్పుడు దేవుడి ఫోటోలతో దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.



### కల్తీ ప్రసాదం నుంచి దేవాలయాల దోపిడీ దాకా..

శ్రీవారి పరకామణిలో అంతర్జాతీయ కరెన్సీ చోరీ జరిగినప్పటికీ కఠిన చర్యలు తీసుకోకుండా సెటిల్‌మెంట్ రాజకీయాలు నడిపారని పల్లా ఆరోపించారు. దేవుడి డబ్బులు కాజేసిన వారిని వెనకేసుకురావడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పరమపవిత్రమైన శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో తయారు చేసిన ఘటన దేశ చరిత్ర లో మచ్చగా మిగిలిందన్నారు. తిరుమల తలనీలా లను రూ.2కోట్లకు కక్కుర్తిపడి మయన్మార్, థాయ్ లాండ్ మార్గంగా చైనాకు తరలించే ప్రయత్నం బయటపడటం వైసీపీ డొల్లతనానికి నిదర్శనమన్నా రు.లడ్డూ కల్తీ అంశం బయటపడిన తర్వాత దాన్ని కప్పిపుచ్చేందుకు కొత్త నాటకాలకు తెరలేపారని విమర్శించారు.

టీటీడీ వీఐపీ, సేవా టికెట్లను వైసీపీ నేతలు అడ్డగోలుగా అమ్ముకున్నారని, దర్శనం నుంచి ప్రసాదాల వరకు అన్నింటిలోనూ బ్లాక్ మార్కెట్ నడిచిందన్నారు. వెంకన్నకిచ్చే తలనీలాలను సైతం అక్రమ రవాణాకు గురిచేసిన దాఖలాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. టీటీడీ నిధులను దారి మళ్లించి ఇతర అవసరాలకు వినియోగించేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు.

### 300కి పైగా దేవాలయాలపై దాడులు

జగన్ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 300కు పైగా దేవాలయాలపై దాడులుజరిగాయని, రామతీర్థంలో రాములవారి శిరస్సు ఖండన వంటి ఘటనలు దేశాన్ని కుదిపేశాయని పల్లా గుర్తుచేశారు. అయిన ప్పటికీ ఒక్కరోజు కూడా బాధిత ప్రాంతాలను సందర్శించి హిందువులకు ధైర్యం చెప్పలేదని విమర్శించారు. దోషులను శిక్షించకపోవడం హిందూ వ్యతిరేక ధోరణికే నిదర్శనమన్నారు.

### సంప్రదాయాల పట్ల చిన్నచూపు

బ్రహ్మోత్సవాల్లో సతీసమేతంగా పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని విస్మరించడం, డిక్లరేషన్ అంశాన్ని పట్టించుకోకపోవడం, పండితుల అభ్యంతరాలను నిర్లక్ష్యం చేయడం హిందూ సంప్రదాయాలను కాలరాయడమేనన్నారు. తిరుమల పవిత్రతకు విరుద్ధంగా అన్యమత ప్రచారాలకు తావిచ్చారని, టీటీడీలో నియామకాల విషయంలోనూ వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు.

### హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలి

జగన్ రెడ్డికి హిందూమతంపై గౌరవం లేదని ఆయన చర్యలే చెబుతున్నాయి. హిందువులను చులకనగా చూసిన ఆయన తన తప్పును ఒప్పుకుని శ్రీవారికి, హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలి అని పల్లా డిమాండ్ చేశారు.



## తిరుమల ఊసెత్తే అర్హత జగన్‌కి లేదు

- సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలని స్వామి దర్శనాన్ని మానుకున్నాడు..
- 18నెలల కాలంలో ఏ ఒక్కసారీ స్వామిని దర్శించని జగన్
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజం

పాలకొల్లు (అమరావతి): సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాల్సి వస్తుందని చెప్పి వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం మానేసిన జగన్మోహన్ రెడ్డికి తిరుమల ఊసెత్తే అధికారం, హక్కూ లేవని రాష్ట్ర జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రంగా విమర్శించారు. అధికారం కోల్పోయిన 18నెలల కాలంలో జగన్ వెంకటేశ్వర స్వామి దర్శించుకున్న దాఖలాలు లేవన్నారు. వెంకన్నకు చేసిన అపకారం, అపచారం గుర్తొచ్చే స్వామి దర్శనానికి వెళ్లడం లేదని రామానాయుడు విమర్శించారు. నాడు రసాయనాల మిశ్రమంతో లడ్డూ ప్రసాదం తయారు చేసి వెంకటేశ్వరస్వామి మహత్యాన్ని తగ్గించాలని జగన్ కుట్ర చేశారని దుయ్యబట్టారు. నేడు వెంకటేశ్వరస్వామి పటాలను పబ్లిసిటీ మెటీరియల్‌గా పేపర్లుగా, ప్లకార్డులుగా వాడడం దారుణమన్నారు. మండలిలో ఆ పార్టీ వ్యవహరించిన తీరు హిందూ సమాజంపై దాడిగా అభివర్ణించారు. స్వామి ప్రసాదంలో రూ.240 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డ వైసిపీకి తిరుమల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. హెరిటేజ్.. ఇందపూర్ డైయిరీకి కొలుగోలుదారేగానీ సరఫరాదారు కాదని.. ఆ విషయం తెలియక చవాకులు మాట్లాడటం రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. దేవాలయాలకు, ప్రభుత్వాలకు నెయ్యి సరఫరా చేయ్యకూడదనేది హెరిటేజ్ కంపెనీ నిర్ణయమని నిమ్మల స్పష్టం చేశారు. ప్రసాదంపై వైసిపీ కుట్రకోణం నుండి ప్రజల దృష్టి మరలించడానికే, నిరాధార ఆరోపణలు హెరిటేజ్‌పై చేస్తున్నారని రామానాయుడు ఆగ్రహించారు. లేని పింక్ డైమండ్ చంద్రబాబు ఇంట్లో ఉందని నాడు జగన్ అబద్దాలు మాట్లాడి బురద చల్లాలని ప్రయత్నించాడని గుర్తు చేశారు. బాబాయిపై గొడ్డలి వేటు వేసి, నారాసుర రక్తచరిత్ర అంటూ చంద్రబాబుపైకి నెట్టబోయి అభాసు పాలయ్యాడన్నారు. పండుగ రోజున సాంప్రదాయంగా గుడికి వెళ్ళవలసిన జగన్, గుడికి వెళ్లడం ఇష్టం లేక, ఇంటి దగ్గర గుడి సెట్టింగ్ వేసి ప్రజలను మాయ చేశాడని, అలాంటి దుర్మార్గులకు తిరుమల పవిత్రత గురించి మాట్లాడే హక్కులేదని మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు.

# మిస్టర్ జగన్ రెడ్డీ.. వెంకన్నతో పెట్టుకోవద్దు

- తిరుమల విషయంలో జగన్‌రెడ్డి వైఖరి సిగ్గుచేటు
- పాలే సేకరించని సంస్థకు నెయ్యి సరఫరాకు అనుమతించారు
- ఇప్పుడు చట్ట సభల్లో స్వామి చిత్రపటాలను అవమానించారు
- పాపాలకు శిక్ష తప్పదని హెచ్చరించిన మంత్రి కొల్లు

మచిలీపట్నం (చైతన్య రథం): దేవుడంటే భక్తి లేదు. హిందువుల మనోభావాలంటే లెక్క లేదు. ఇప్పుడు ఏకంగా చట్ట సభల్లో కూడా దేవదేవుడిని అవమానించేలా వ్యవహరించిన జగన్‌రెడ్డికి తగిన గుణపాఠం తప్పదని రాష్ట్ర గనులు మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. ఈమేరకు మచిలీపట్నం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ.. "తిరుమల తిరుపతి దేవస్థానం విషయంలో ప్రతి ఒక్కరూ ఎంతో పవిత్రంగా ఉండాలని ప్రయత్నిస్తాం. అలాంటిది స్వామివారి మాడ వీధుల్లో చెప్పులతో తిరిగిన వ్యక్తి జగన్‌రెడ్డి. అన్యమతస్తులు డిక్లరేషన్ ఇవ్వాలంటే రాద్ధాంతం చేశాడు. గతంలో అబ్దుల్ కలాం, సోనియా గాంధీలాంటి ఎంతోమంది ప్రముఖులు డిక్లరేషన్ ఇచ్చి వెంకటేశ్వర స్వామిమీద విశ్వాసం ఉందని చెప్పి దర్శనం చేసుకున్నారు. ఐదేళ్లు అధికారంలో ఉండీ.. కనీసం స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించే కార్యక్రమాన్ని సతీసమేతంగా ఒక్కసారీ నిర్వహించలేదు. మనం అత్యంత పవిత్రంగా భావించే మహా ప్రసాదాన్ని కూడా ఏరోజూ ఆయన నోట్లో వేసుకోలేదు. ఇంటిముందు వెంకటేశ్వర స్వామి ఆలయం సెట్టింగ్




వేసుకున్నారు. దేవుడి ప్రసాదాన్ని తినకుండా పేపర్లో చుట్టి పడేశారు" అంటూ దుమ్మెత్తి పోశారు. శాసన మండలి, శాసనసభలో ఎటువంటి మతాల, దేవుళ్ల ప్రదర్శన చేయకూడదనేది క్లియర్‌గా ఉంది. అలాంటిది చట్ట సభల్లో వెంకటేశ్వర స్వామి ఫోటోలు తీసుకొచ్చి అక్కడ కూడా రాజకీయం చేయాలని ప్రయత్నం చేశారు. చేసిందే మహాపాపం. వెంకటేశ్వర స్వామి ప్రసాదంలో అసలు నెయ్యే లేకుండా కల్తీ చేసి అవమానించారు. ఒక్క చుక్క పాలు కూడా కొనన టువంటి సంస్థల నుంచి నెయ్యి సేకరించారు. ఒక చుక్క పాలు కూడా తీయకుండా నెయ్యి వస్తదా? డోలే బాబా డెయిరీ వాళ్ళు కెమికల్స్ కొన్నారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే నిబంధనలు మొత్తం కూడా సడలించారు. సుప్రీం కోర్టు ఆధ్వర్యంలో నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ అక్రమా లన్నింటినీ స్పష్టంగా పేర్కొంది. దాన్ని డైవర్ట్ చేయడం కోసం నీచమైన సంస్కృతికి తెరలేపాడు. తిరుమల తిరుపతి దేవస్థానాన్ని వాళ్ళ స్వార్ధానికి వాడుకున్నారు. ఆనాడు రాజశేఖర రెడ్డి ఐదు కొండలు ఎందుకు ఏడు కొండలు ఎందుకు, రెండు కొండలు చాలు అన్నాడు. తర్వాత ఏమైందో ప్రజలంతా చూసాం. పవిత్రమైన తిరుమల తిరుమతి దేవస్థానంలో 68 లక్షల కిలోల నెయ్యే లేనటువంటి నెయ్యిని తీసుకొచ్చి, 20 కోట్ల లడ్డు ప్రసాదాలు తయారు చేసిన దుర్మార్గుడు జగన్‌రెడ్డి.

అధికారంలోవున్న ఐదేళ్లూ తిరుమల తిరుపతి దేవస్థానం నిధుల్ని తిరుపతి కార్పొరేషన్‌కు డైవర్ట్ చేసుకున్నారు.కమిషన్లకోసం పనులు చేసుకున్నారు. ఎన్నికల్లో దేవాలయానికి సంబంధించిన నిధులు వాడుకున్నారు. చివరికి రామజన్మభూమిలో రాము లవారి ప్రసాదానికి కూడా కల్తీ లడ్డూలే పంపించా రు. ప్రధానమంత్రికి కూడా కల్తీ లడ్డూలే పెట్టారు. ఇప్పుడు శాసన మండలిలో చెప్పులు వేసుకుని దేవుని చిత్రపటాలు పట్టుకుని అవమానిం చారు. పవిత్రతను దెబ్బ తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగన్‌రెడ్డి అరాచకాలు అన్నీ భయటపడడంతో తప్పించుకోవడానికి హెరిటేజ్‌పై నిందలేస్తు న్నాడు. హెరిటేజ్ సంస్థ ప్రారంభం నుండి ఏనాడూ ప్రభుత్వంతో ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేదు. ఎప్పుడూ చుక్క పాలు కూడా ప్రభుత్వానికి సరఫరా చేయలేదు. హెరిటేజ్ సంస్థ పలుడెయిరీలనుంచి చీజ్ మాత్రమే సేకరించారు. చీజ్‌ను చూపించి నెయ్యి అంటూ వైసీపీ నేతలు పిచ్చి ప్రేలాపన లు చేస్తున్నారు. వైసీపీలాంటి అరాచక శక్తుల విషయంలో ప్రజలు అప్ర మత్తంగా ఉండాలి. గత ఐదేళ్ల అరాచక పాలన చూసి ప్రజ లు 151నుంచి 11కి దింపే శారు. రాబోయే కాలంలో కనీసం ఒక్క సీటు కూడా లేకుండా చేయడంలో ప్రజలు ఏమాత్రమూ ఉపే క్షించారు. జగన్‌రెడ్డి అనే ఉన్మా ది విష యంలో ప్రజలు అప్ర మత్తంగా ఉండా లని మంత్రి కొల్లు రవీంద్ర సూచిం చారు.

## స్వార్థ రాజకీయాల కోసం వెంకన్నను వాడుకుంటారా?

*పాపాలకు మూల్యం చెల్లించక తప్పదు: మంత్రి డోలా*



ప్రకాశం/ ఒంగోలు (చైతన్యరథం): వైసీపీ నేతలు తమ స్వార్థ రాజకీయాలకు వెంకటేశ్వర స్వామిని వాడుకోవడం సిగ్గు చేటని, దేవుడితో పెట్టుకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని సాంఘిక సంక్షేమమంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి హెచ్చరించారు.ఆదివారం ఒంగోలులో ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, దామచర్ల జనార్ధన్‌తో కలసి మంత్రి మీడియాసమావేశం నిర్వహించారు.మంత్రి డోలా మాట్లాడుతూ వైసీపీ హయాంలో జగన్ తన సొంత చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డిని టీటీడీ బోర్డు చైర్మన్‌గా నియమించి అక్రమాలకు పాల్పడ్డారు. వైసీపీ హయాంలో టీటీడీలో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. వైవీ సుబ్బారెడ్డి లడ్డు లో కల్తీ జరిగింది వాస్తవమేనని మాట్లాడితే జగన్మోహన్‌రెడ్డి మాత్రం కల్తీ జరగలేదని బుకాయిస్తున్నారు.అసలు వైసీపీ ప్రభుత్వ హయాంలో తయారు చేసిన తిరుమల ప్రసాదం లడ్డూలలో నెయ్యేలేదు. సిట్‌లో ఏమీ లేదని మాట్లాడుతున్నారు. దేవుడి మీద జగన్‌కు,వైసీపీ నేతలకు విశ్వాసంలేదు. శాసనమండలిలో చెప్పులువేసుకొని వెంకటేశ్వర స్వామి పటం తేవడం ఎంతవరకు సమంజసం? అని మంత్రి ప్రశ్నించారు. సభకు ఫోటోలు తీసుకురావడం క్షమించరాని నేరం. బయటకు వెళ్తూ బల్లలమీద వెంకటేశ్వరస్వామి పటాలను విసిరేసి వెళ్లారు. వైసీపీ నాయకులకు, జగన్‌కు దేవుడి మీద నమ్మకం లేదు. హిందూ ధర్మం మీద, విశ్వాసాల మీద, కలియుగ ప్రత్యక్ష దేవుడి మీద నమ్మకం లేదు. వైసీపీ వ్యహారశైలి ప్రజలు గమనిస్తున్నారు. జగన్ చెప్పిన డైరెక్షన్‌లో దేవుడితో రాజకీయాలు చేస్తే దానికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మంత్రి స్వామి హెచ్చరించారు. చేసిన అక్రమాలన్నీ చేసి సిగ్గు లేకుండా హెరిటేజ్ మీద బురద చల్లుతున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆగ్రహం

# సేద్యానికి మరింత ఊతం

- డబుల్ ఇంజిన్ సర్కారుతో వ్యవసాయాభివృద్ధి
- కేంద్రమంత్రి చౌహాన్‌తో మంత్రి అచ్చెన్నాయుడు భేటీ
- వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమంపై సమగ్ర చర్చలు
- మైక్రో ఇరిగేషన్‌కు నిధుల విడుదల చేయాలన్న అచ్చెన్న
- సానుకూలంగా స్పందించిన శివరాజ్ సింగ్ చౌహాన్



తిరుమల (చైతన్య రథం): డబుల్ ఇంజిన్ సర్కారు పాలనలో కేంద్ర, రాష్ట్రాలు సమన్వయంతో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సి ఉందని కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. అందుకు అనుసరించాల్సిన మార్గాలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలపై చర్చించారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం ఉదయం తిరుమలను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమం అమలు, కేంద్ర పథకాల వినియోగతీరుపై ఇద్దరు మంత్రులు విస్తృతంగా అభిప్రాయాలు పంచుకున్నారు. రాష్ట్రంలో రైతులకు మద్దతుగా కేంద్రం అందిస్తున్న సహకారం, నిధులు మరియు వివిధ పథకాల అమలుపై మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రైతుల ఆదాయవృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సాగు ఖర్చుల తగ్గింపు దిశగా కేంద్రం అందిస్తున్న సహకారం రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతోందని కొనియాడారు.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో వ్యవసాయరంగాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరు మంత్రులు ఆకాంక్షించారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న మైక్రో ఇరిగేషన్ పథకానికి సంబంధించిన కేంద్ర వాటా నిధుల విడుదల అంశాన్ని మంత్రి అచ్చెన్నాయుడు ప్రస్తావించారు. రాష్ట్రంలో ఇప్పటికే అమలు చేసిన పథకాల కింద కేంద్ర వాటాగా మొత్తం రూ.695 కోట్లు రావలసి ఉందని గుర్తు చేశారు. ఈ నెలలో కేవలం రూ.50 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని, ఇంకా రూ.645 కోట్లు విడుదల చేయాల్సి ఉందని వివరించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మిగిలిన కేంద్ర వాటా నిధులను తక్షణమే విడుదల చేయాలని మంత్రి కోరారు. అదేవిధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కనీసం మరో రూ.400 కోట్లు కేంద్ర వాటా నిధులు విడుదల చేయవలసిందిగా కోరారు. మైక్రో ఇరిగేషన్ విస్తరణ ద్వారా నీటి వనరుల సమర్థ వినియోగం, సాగు వ్యయాల తగ్గింపు, రైతుల ఆదాయవృద్ధి సాధ్యమవుతాయని మంత్రి పేర్కొన్నారు. ఈ విషయాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు, త్వరితగతిన నిధుల విడుదలకు చర్యలు చేపడతామని చౌహాన్ హామీ ఇచ్చారు.

## బడుగుల అభివృద్ధికి
# కూటమి కంకణం



- గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం
- రూ.25 లక్షలతో రజక కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

నూజివీడు/ ఏలూరు (చైతన్య రథం): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కంకణబద్ధమై ఉందని గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థ సారథి స్పష్టంచేశారు. నూజివీడు పట్టణం లో వెలమపేట రెండో వార్డులో సుమారు రూ.25 లక్షలతో రజక కమ్యూనిటీ హాలు కు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాట్లాడుతూ రజకులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ త్వరలో పరిష్కరిస్తానన్నారు. బీసీ సంక్షేమానికి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.52 వేల కోట్లు ప్రతిపాదించింద న్నారు. బీసీల నైపుణ్యాలు పెంచడమే కాదు, ఆర్థికాభివృద్ధికి సబ్సిడీతో రుణా లిస్తున్నా మని మంత్రి పేర్కొన్నారు. నూజి వీడు నియోజకవర్గ పరిధిలోని అన్ని సామాజిక వర్గాలకు కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తున్నామన్నారు. బీసీ కమ్యూనిటి హాలుకు రూ.50లక్షలు, ఇతర కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.30 నుండి 50లక్షలు కేటాయించి త్వరలో పూర్తి చేస్తామన్నారు. అలాగే కాపు కమ్యూనిటి హాలు కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించేందుకు కూటమి నేతలు సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ధోబి గాట్స్, విద్యుత్ బిల్లుల రాయితీ, జీవో నెంబర్ 111 అమలుకు కృషి చేస్తానన్నారు. చట్టసభల్లో దామాషా ప్రకారం స్థానం కల్పించడానికి, స్థానిక ఎన్నికల్లో బీసీలకు అవకాశం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డి రామారావు, టీటీడీ సభ్యుడు శ్రీనివాసరావు రజక సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి అసలు చిరునామా మేమే

## ఏటిగట్టు పనుల నాణ్యత విషయంలో రాజీ లేదు: మంత్రి నిమ్మల

పాలకొల్లు (చైతన్య రథం): పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధిలో అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ మేమే ముందుంటామని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు పునరుద్ఘాటించారు. నియోజకవర్గంలోని యలమంచిలి మండలం కంచుస్థంభం పాలెంనుంచి బాడవ వరకు 16.72 కోట్లతో నిర్మిస్తున్న గోదావరి ఏటిగట్టు పటిష్ట పనులను పరిశీలించారు. 1986 గోదావరి వరదలలో అత్యధికంగా 36 లక్షల క్యూసెక్కులు వరద నీరు వచ్చిందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వరదలు వచ్చిన ప్రతిసారి గోదావరి తీర గ్రామాల ప్రజలు బిక్కు బిక్కు మంటూ బతకాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ దుస్థితికి శాశ్వత పరిష్కారం కావాలన్న ఉద్దేశంతోనే ఏటిగట్ల పటిష్టతకు 18 కోట్లు, దానిపై గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి నాలుగు కోట్లు మంజూరు చేయించి పనులు చేపట్టామన్నారు. 2019 –24 వైకాపా హయాంలో ఒక్క పైసా కూడా కేటాయించలేదని విమర్శించారు. రాష్ట్రంలో నిధుల సమస్య ఉన్నా తాను కష్టపడి మంజూరు చేయించిన నిధులు ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడాలి అన్నారు. ఈరోజు 4.5 కోట్ల రూపాయల



విలువైన 23 పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ముఖ్యంగా ప్రతిష్టాత్మకమైన ఏటిగట్టు పనులకు సంబంధించిన నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పర్యవేక్షణ అధికారులను, కాంట్రాక్టర్‌ను పిలిచి మాట్లాడారు. టెండర్ నిబంధనల ప్రకారం ఏం చేయాలి? మీరు ఏం చేస్తున్నారంటూ ఆరా తీశారు. బయటనుంచి మట్టి తెచ్చుకోవాలి, ఫిల్ చేసుకోవాలి. మట్టిలో వేర్లు, ఆకులు ఉండకూడదు. మీరు ఏతప్పు చేసినా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది కాబట్టి.. తప్పిదానికి మీరే బాధ్యత వహించాల్సి వస్తుంది. చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. స్థానికులతో మాట్లాడుతూ ఏటిగట్టు తొలిదశగా మట్టి రోడ్డు, తర్వాత గ్రావెల్ రోడ్డు, తర్వాత బ్లాక్ టాప్ వేస్తామని వివరించారు. అలాగే స్థలంలేని వాళ్ళకి స్థలాలు, స్థలాలున్న వాళ్ళకి ఇళ్ళు యుద్ధ ప్రాతిపదికన కట్టించే ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇల్లు ఖాళీ చేసి వెళ్లాల్సిన వారెవరు కూడా బాధపడుతూ కాకుండా ఆనందంగా వెళ్లాలని, ఆ రకంగా ఇళ్ల నిర్మాణం జరగాలని ఆయన సూచించారు.

## చిత్తూరులో ఘనంగా టీడీపీ కార్యాలయ భూమి పూజ

**-హాజరైన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

**-స్వాగతం పలికిన చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్**

చిత్తూరు (చైతన్య రథం): చిత్తూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణానికి సంబంధించి భూమి పూజ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర రవాణా మంత్రి, చిత్తూరు జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన నిర్వహించారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సమన్వయానికి కార్యాలయం కేంద్ర బిందువుగా నిలుస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు దిశగా కార్యాలయం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పుంగనూరు టిడిపి ఇన్‌చార్జ్ చల్లా బాబు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల సమిష్టి కృషితో చిత్తూరులో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



చైతన్యరథం

సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో డైనమాటిక్ టెక్నాలజీస్ ప్రతినిధుల భేటీ అయ్యారు. డైనమాటిక్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్ మరియు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉదయంత్ మల్హోత్రా, ఏరోస్పేస్ విభాగం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మరియు హెడ్ పి చలపతి, డైరెక్టర్ అహిల్యా మల్హోత్రా, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆండ్రియా మిలానీ, సంస్థ యూరప్ వ్యాపార కార్యకలాపాల సీనియర్ ఎగ్జిక్యూటివ్ క్రిస్టినా లిడేగార్డ్ సీఎంతో జరిగిన సమావేశంలో ఉన్నారు. ఏవియేషన్ రంగంలో, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో తమ సంస్థ కార్యకలాపాలపై ప్రజంటేషన్ ఇచ్చారు. డిఫెన్స్ రంగంలో తమ సంస్థ అనుభవాన్ని వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఏపీ ప్రభుత్వ విధానాలు, డిఫెన్స్, ఏరో స్పేస్‌రంగంలో ఉన్న అవకాశాలను వివరించారు. సమావేశంలో పరిశ్రమలు శాఖ కార్యదర్శి యువరాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.





స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.









గుంటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి స్వాగతం పలికిన కూటమి ఎమ్మెల్యేలు, నేతలు, అధికారులు.









# ప్రజల్లోంచి పుట్టిన పార్టీ తెలుగుదేశం

- **దశాబ్దాల కలకు నేడు జీవం పోయడం సంతోషంగా ఉంది**
- **కృష్ణా జిల్లా పార్టీ ఆఫీసు శంకుస్థాపనలో మంత్రి కొల్లు రవీంద్ర**



మచిలీపట్నం (చైతన్య రథం): కృష్ణా జిల్లాకు సొంత పార్టీ కార్యాలయం నిర్మాణం ఎన్నో ఏళ్ల కల. ఎంతోమంది ఎన్నో ప్రయత్నాలు చేసినా.. సఫలం కాలేదు. కానీ నేడు కార్యరూపం దాల్చడం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్ర గనుల మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని వలందపాలెం పాత ఆర్టీవో కార్యాలయం వద్ద కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయానికి ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, జిల్లా అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి గోపు సత్యన్నారాయణ, ఎమ్మెల్యేలందరి సమక్షంలో భూమిపూజ చేశారు. సీఎం చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రోద్బలంతో నూతన కార్యాలయానికి శంకుస్థాపన చేసుకుంటున్నాం. ప్రజలకు సేవ చేయాలి. ప్రజల కోసం పని చేయాలనే ఏకైక లక్ష్యంతో నిత్యం పని చేసే పార్టీ తెలుగుదేశం. మనం అధికారంలో ఉన్నా, లేకున్నా నిరంతరం ప్రజా సమస్యలని తెలుసుకోవడం, ప్రజావేదిక ద్వారా సమస్యల పరిష్కారించడం టీడీపీ స్థాపించిన నాటినుంచి ఆనవాయితీగా మారింది. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండడంతో పాటుగా, ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యాలయం చాలా ఉపయోగపడుతుంది. జిల్లాలో ఉన్నటువంటి స్థితిగతుల్ని మార్చడానికి, పేద, బడుగు, బలహీన వర్గాల భవిష్యత్తు ప్రణాళికలు తయారు చేయడానికి, ఈ జిల్లా అభివృద్ధికిగాని కార్యాలయంలోనే రేపు కీలక నిర్ణయాలు తీసుకోబోతున్నాం అని మంత్రి పేర్కొన్నారు. కార్యాలయాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రతి క్షణం ప్రజలకు అందుబాటులో ఉంటామని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణ ప్రసాద్, బిజెపి జిల్లా అధ్యక్షులు తాతినేని శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సీ యలమంచిలి రాజేంద్రప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, బిజెపి మచిలీపట్నం నియోజకవర్గ ఇన్చార్జి సోడిశెట్టి బాలాజీ, రావి వెంకటేశ్వరావు, కొనకళ్ళ జగన్నాథం (బుల్లయ్య) జిల్లా పార్టీ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు

# అభివృద్ధి.. ఆరోగ్యం.. ఆత్మగౌరవం

## ఇవీ కూటమి ప్రభుత్వ ప్రాధాన్యతలన్న మంత్రి దుర్గేష్

### నెస్లే ఇండియా సహకారంతో 'బయో టాయిలెట్లు' ప్రారంభం



నిడదవోలు (చైతన్య రథం): అభివృద్ధి, ఆరోగ్యం.. ఆడబిడ్డల ఆత్మగౌరవం ఇవే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యతలుగా పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ ఉద్ఘాటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించి, వారి ఆరోగ్యం, ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నామన్నారు. ఆదివారం నిడదవోలు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల మరియు నిడదవోలు రూరల్ మండలం సమిశ్రగూడెంలో నెస్లే ఇండియా కంపెనీ తన సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన బయో టాయిలెట్లను మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన బాగున్నప్పటికీ, కేవలం టాయిలెట్లు వంటి కనీస వసతులు లేకపోవడం వల్లే ఆడపిల్లలు పాఠశాలలకు రావడం మానేస్తున్నారని ఒక సర్వే రిపోర్ట్ పేర్కొందని గుర్తుచేశారు. ఈ సమస్యను అధిగమించేందుకు నెస్లే ఇండియా కంపెనీ ముందుకు వచ్చి దాదాపు రూ.30 లక్షల వ్యయంతో నిడదవోలు నియోజకవర్గంలో 15 యూనిట్ల బయో టాయిలెట్లను నిడదవోలు పట్టణంలోని జెడ్పీ గర్ల్స్ హైస్కూల్, సమిశ్రగూడెం, కానూరు, ముక్కామల ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. టాయిలెట్లను కేవలం నిర్మించడం మాత్రమే కాదు, వాటిని నిత్యం శుభ్రంగా ఉంచుకోవడం సామూహిక బాధ్యత అని మంత్రి దుర్గేష్ సూచించారు. "పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. అవసరమైతే మనమే క్లీన్ చేసుకోవాలి, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలి" అని విద్యార్థులకు, సిబ్బందికి మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు.కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని మంత్రి దుర్గేష్ అన్నారు. పలు సందర్భాల్లో నిడదవోలు నియోజకవర్గంలో బయో టాయిలెట్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలుమార్లు తాను అన్న సందర్భాన్ని గుర్తుచేసుకొని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ప్రత్యేక చొరవతో నిడదవోలు నియోజకవర్గానికి ఈ వసతులు అందించేందుకు సహకరించినందుకు మంత్రి దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థినులు మంత్రి దుర్గేష్‌ను ర్యాలీగా సభా వేదిక వద్దకు తీసుకువచ్చారు. వేదికపై విద్యార్థినులతో కలిసి మంత్రి దుర్గేష్ ఉత్సాహంగా గడిపారు. "నెస్లే అంటే మీకు ఏం గుర్తొస్తుంది?" అని ప్రశ్నిస్తూ వారితో సరదాగా ముచ్చటించారు. విద్యార్థులు అద్భుతమైన భవిష్యత్తును పొందాలని, నిరంతరం పాఠశాలకు వచ్చి బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, నెస్లే కంపెనీ సీనియర్ మేనేజర్ మహ్మద్, ఏఎంసీ వైస్ చైర్మన్ రతీదేవి, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ చర్య అవివేకం




**ప్రపంచ వేదికను రాజకీయ వేదికగా మారుస్తారా?**

**ఆవిష్కరణల దిశగా దేశం వెళ్తుంటే.. అర్ధనగ్న ప్రదర్శనలా**

**తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ధ్వజం**

**విశాఖలో బహిరంగ నిరసన తెలిపిన కూటమి పక్షాలు**

విశాఖపట్నం (చైతన్య రథం): న్యూఢిల్లీలో నిర్వహించిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ వేదిక వద్ద ఇండియన్ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేపట్టిన 'అర్ధనగ్న' పదర్శనపై విశాఖపట్నంలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. జీవీఎంసీ ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేశ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై ప్రతిబింబించాల్సిన అంతర్జాతీయ సదస్సును యువ కాంగ్రెస్ రాజకీయ ప్రదర్శనగా మార్చడం దారుణమన్నారు. భారతదేశం కృత్రిమ మేధస్సు రంగంలో ఎదుగుతున్న శక్తిగా నిలుస్తున్నవేళ, ఇలాంటి అవివేక చర్యలు దేశ గౌరవాన్ని దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలు భారత్‌ను అభివృద్ధి చెందుతున్న ఏఐ శక్తిగా చూస్తున్న సమయంలో, దేశ ప్రయోజనాలకంటే పార్టీ రాజకీయాలకు ప్రాధాన్యం ఇవ్వడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి అంతర్జాతీయ వేదికలపై రాజకీయ హంగామాలు చేయడం ద్వారా మన దేశ ప్రతిష్ఠను తగ్గించడమే తప్ప మరే ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. భారతదేశ ఆవిష్కరణలు, సాంకేతిక ప్రగతి, యువత ప్రతిభతో ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న వేళ, చిన్నచూపు రాజకీయాలతో దేశాన్ని అపహాస్యం చేయకూడదని పల్లా స్పష్టం చేశారు. దేశ నిర్మాణంలో భాగస్వాములుగా మారాల్సిన యువత, అంతర్జాతీయ వేదికలను అవమానించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. నిరసన కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పాల్గొని యువ కాంగ్రెస్ ప్రవర్తనను ఖండించారు. అలాగే ఇతర కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై నిరసన వ్యక్తం చేశారు. దేశ గౌరవం రాజకీయాలకు అతీతమని, అభివృద్ధి, ఆవిష్కరణల దిశగా మనం ఐక్యంగా ముందుకు సాగాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

# పేదలకు కొండంత అండ!



- **ముఖ్యమంత్రి సహాయనిధిపై మంత్రి కందుల దుర్గేష్ వ్యాఖ్య**
- **26మందికి రూ.29.45 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత**

నిడదవోలు (చైతన్య రథం): నిరుపేదల ఆరోగ్య భద్రతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరమని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలులోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు రూ. 29,45,512 విలువైన చెక్కులు, ఎల్‌వోసీ పత్రాలు పంపిణీ చేశారు. నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటివరకు సీఎంఆర్‌ఎఫ్, ఎల్‌వోసీ, ప్రత్యేక ఆర్థిక సాయం కింద 635మందికి రూ.4,85,87,498 లబ్ధి చేకూర్చామని వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ సీఎం చంద్రబాబునాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా 'హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఏపీ' నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆరోగ్యం ఉంటేనే సంపద ఉంటుంది.

అప్పుడే సమాజం సంతోషంగా ఉంటుంది. అందుకే ప్రస్తుత బడ్జెట్‌లో ఆరోగ్య శాఖకు సుమారు రూ.19,000 కోట్లు కేటాయించడం జరిగింది. 863 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది అని మంత్రి దుర్గేష్ వివరించారు. మంచి కార్యక్రమాల్లో ప్రజలు కూడా భాగస్వామ్యులై ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. తద్వారా ప్రజలను, సమాజాన్ని బాగు చేసుకొందామని పిలుపునిచ్చారు.

## వెంకన్నను దర్శించుకున్న అచ్చెన్న

# కుటుంబ సమేతంగా తిరుమల పర్యటన



తిరుమల (చైతన్య రథం): రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కుటుంబసమేతంగా ఆదివారం తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దంపతులకు వేద పండితులు వేదాశీర్వచనం అందజేసి స్వామి కృపా కటాక్షాలు కలగాలని ఆశీర్వదించారు. తిరుమల దేవస్థానం జేఈవో వెంకయ్య చౌదరి స్వామివారి తీర్థ ప్రసాదాలను మంత్రికి అందించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని, పెట్టుబడులు మరింతగా రావాలని, ప్రజలందరికీ సంక్షేమ ఫలితాలు చేరాలని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీస్సులతో ప్రభుత్వం మరింత అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర శ్రేయస్సు, రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలని స్వామి వారి సన్నిధిలో ప్రార్థించినట్టు మంత్రి పేర్కొన్నారు.

## భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి పోలేరమ్మ తల్లి

- **ఆలయాభివృద్ధికి కొత్త కమిటీ కృషి చేయాలి**
- **మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పిలుపు**



ప్రకాశం /జరుగుమల్లి (చైతన్య రథం): భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పోలేరమ్మ తల్లి అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం కామేపల్లిలో పోలేరమ్మ తల్లి దేవస్థానం నూతన కమిటీ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మ్యారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ మాట్లాడుతూ.... భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పోలేరమ్మ తల్లి, ఈ ఆలయానికి జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకునేందుకు వస్తుంటారు. నూతన ఆలయ కమిటీ దేవాలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలి. భక్తుల సౌకర్యం కోసం దేవాలయం బయట మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు, కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు చేపడతాం. కూటమి పాలనలో హిందూ దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారు. వైసిపి హయాం లో దేవాలయాల ప్రతిష్టను మంట గలిపి హిందువుల మనోభావాలు దెబ్బతీశారు. కాసుల కక్కుర్తితో తిరుమల శ్రీవారి ప్రసాదంలో కృత్రిమ నెయ్యి వాడి మహాపచారం చేశారు. ప్రసాదంలో కల్తీ జరిగిందని ఓవైపు నాడు టిటిడి చైర్మన్‌గా పని చేసిన వైవీ సుబ్బారెడ్డి ఒప్పుకున్నారు, కానీ జగన్ మాత్రం కల్తీ జరగలేదని బుకాయిస్తున్నారు. సిట్ నివేదికను సైతం వక్రీకరిస్తున్నారు. వైసిపి తీరును వెంకటేశ్వరస్వామి గమనిస్తున్నాడు, ఆయనే తగిన విధంగా వారిని శిక్షిస్తాడని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# మైనారిటీల అభివృద్ధి కూటమితోనే సాధ్యం

## ●అయేషా మసీదులో ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ముస్లిం మైనారిటీల అభివృద్ధి కేవలం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 43వ డివిజన్ మల్లికార్జుననగర్‌లోని అయేషా మసీదులో జరిగిన ఇఫ్తార్ విందుకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఏపీ శెట్టి బలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, నగర టీడీపీ అధ్యక్షులు మజ్జి రాంబాబు, ముస్లిం పెద్దలు ఛాన్ బాషా, కంటిపూడి శ్రీనివాస్, ఆయేషా మసీదు కమిటీ సభ్యులు తదితరులతో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరిగిన ముస్లింల మతపరమైన ప్రార్థనల్లో పాల్గొని అల్ సమి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మహమ్మద్ అబ్దుల్లాతో కలిసి ఇఫ్తార్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... అన్ని మతాలను ఏకం చేసేదే ఈ పవిత్రమైన ఇఫ్తార్ విందు అని అన్నారు. ఈ పవిత్ర మాసంలో ఉపవాసం, ప్రార్థనలు మనల్ని ఆత్మవిశ్వాసం, కరుణ, సోదరత్వం వైపు నడిపిస్తాయన్నారు. రంజాన్ మనకు బోధించే సత్యం ఏమిటంటే... మనం అందరూ ఒకే దేవుని సృష్టులం, భగవంతుని మార్గంలో ఐక్యంగా నడవాలని సూచిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఈ సోదరత్వాన్ని పెంచుతోందని, మతం, కులం, మతపరమైన విభేదాలను మరచి, పేదలు, రైతులు, యువత, మహిళల అభివృద్ధికి కృషి చేస్తుస్తోందన్నారు. ఈ రంజాన్ రాష్ట్రంలో శాంతి, సమృద్ధి, ఐక్యతను తీసుకువస్తుందని నమ్ముతున్నామన్నారు. తన సోదరులైన ముస్లిం మైనారిటీలంతా ఆరోగ్యం, సుఖశాంతులతో జీవించాలని ఆ అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కాగా నగరంలోని పలు మసీదులు, షాదీ ఖానాల అభివృద్ధికి తమ భవానీ చారిటబుల్ ట్రస్టు తరపున నిధులు కేటాయించి అభివృద్ధి చేసినట్టు తెలిపారు. నగరంలోని మసీదులు, షాధి ఖానాలకు, ముస్లిం బరియల్కు ఇప్పటికే కమిటీలు నియమించినట్టు తెలిపారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తామని స్పష్టం చేశారు. అన్ని విషయాల్లోనూ ముస్లింలతో కలిసి ముందుకు నడుస్తామని, వారికి అండగా ఉంటామన్నారు. మత సామరస్యాన్ని కాపాడటమే కాకుండా అన్ని విధాలుగా ముస్లిం మైనారిటీలను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముస్లింల అభివృద్ధికి కృషి చేసింది ఒక్క తెలుగుదేశం మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, అధిక సంఖ్యలో ముస్లింలు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్య భద్రతే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## ● 26 మందికి సీంఎఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన మంత్రి కందుల దుర్గేశ్



నిడదవోలు (చైతన్యరథం): పేదల ఆరోగ్య భద్రతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. ఆదివారం నిడదవోలులోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 26 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్దిదారులకు రూ. 29.45 లక్షలు విలువైన చెక్కులను, ఎల్వోసీ పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 'ఆరోగ్యం ఉంటేనే సంపద ఉంటుంది, అప్పుడే సమాజం సంతోషంగా ఉంటుంది. అందుకే ప్రస్తుత బడ్జెట్లో ఆరోగ్య శాఖకు సుమారు రూ. 19వేల కోట్లు కేటాయించారు. 863 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది' అని ఆయన పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా.. సీఎంఆర్ఎఫ్కు దరఖాస్తు చేసుకున్న వారికి తక్కువ కాలంలోనే నిధులు విడుదలయ్యేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి దుర్గేశ్ తెలిపారు.

# కూటమి ప్రభుత్వంతోనే శ్రీరామరక్ష... మంచి ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

## ●పాలకొల్లు నియోజకవర్గంలో రూ.4.43 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## ●అభివృద్ధి పనులకు ఆదివారం శెలవు లేదు : మంత్రి నిమ్మల రామానాయుడు



పాలకొల్లు (చైతన్యరథం): మన రాష్ట్ర ప్రగతి, మన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే మరో పది, పదిహేను సంవత్సరాలు కూటమి ప్రభుత్వం అధికారంలో కొనసాగాలని, అదే అందరికీ శ్రీరామరక్షని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. అభివృద్ధి పనులకు ఆదివారం శెలవు కాదు అంటూ పాలకొల్లు నియోజకవర్గంలో ఒకే రోజు 23 గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేస్తూ రూ. 4.43 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా యలమంచిలి మండలం కొంతేరు గ్రామంలో జరిగిన సభలో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం పరుగులు పెడుతుందన్నారు. రాష్ట్ర విభజన కన్నా, వైసీపీ ప్రభుత్వ పాలన వల్లే ఎక్కువ నష్టం జరిగిందన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం చేసి అప్పులపాలు చేశాడన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు చేసుకుంటూ, మరోపక్క ప్రజలకు సంక్షేమాన్ని అందించి ప్రజలందరినీ వైకుంఠపాళీ మాదిరిగా ఒక్కొక్క మెట్టు ఎక్కించి పైకి తీసుకువెళ్తే, వైసిపి పాలనలో జగన్ అనే పాము కాటేస్తే మళ్లీ కిందకు వచ్చేసారన్నారు. కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాగానే మళ్లీ పైకి తీసుకు వెళ్లేందుకు ఒక్కొక్క మెట్టు ఎక్కుతున్నారని, జగన్ అనే పెద్ద పాము రూపంలో కాటు వేయకుండా ఉండాలంటే వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయకుండా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నిటిని నెరవేర్చారని మంత్రి రామానాయుడు తెలిపారు. కొంతేరు గ్రామంలో గత టీడీపీ ప్రభుత్వంలోనూ, మళ్లీ కూటమి ప్రభుత్వాల్లోనూ కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వైసిపి పాలనలో రూపాయి పని కూడా జరగలేదన్నారు. మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల కలయికతో రాష్ట్రంలో మంచి పాలన అందుతుందని ప్రజలందరూ ఆశీర్వదించాలని మంత్రి రామానాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఉన్నమట్ల కబర్ధి, గంటా శ్రీనివాస్, కడలి గోపాలరావు, ఉన్నమట్ల ప్రేమ కుమార్, తుల రామలింగేశ్వరరావు, రుద్రరాజు సత్యనారాయణ రాజు, బత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా టీడీపీ

## ● రూ.5 లక్షల బీమా చెక్కు అందజేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో బొల్లాపల్లి మండలం, రేమడిచర్ల గ్రామానికి చెందిన భూక్య తాసిల్ నాయక్ ఇటీవల విద్యుత్ ప్రమాదానికి గురై దురదృష్టవశాత్తు మరణించిన సంగతి తెలిసిందే.కేవలం 100 రూపాయలకే టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. ఆ సభ్యత్వం ద్వారా లభించే ప్రమాద బీమా సౌకర్యం ఇప్పుడు ఆయన కుటుంబానికి కొండంత అండగా నిలిచింది. రూ. 5,00,000 (అక్షరాలా ఐదు లక్షల రూపాయలు). మృతుని భార్య మంగా భాయ్‌కి అందజేసిన ప్రభుత్వ చీఫ్ విప్, జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ... పార్టీ కార్యకర్తలకు, సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి ఆపద కాలంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కేవలం వంద రూపాయల సభ్యత్వంతో ఐదు లక్షల రూపాయల బీమా అందడం అనేది పార్టీకి కార్యకర్తలపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం రోశయ్య జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయం

## ●అర్థవంతమైన చర్చలకు రోశయ్య హయాంలో పెద్దపీట

## ●విషయ పరిజ్ఞానం, చలోక్తులు రోశయ్య ప్రత్యేక గుర్తింపు

## ●మచిలీపట్నంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రోశయ్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్యరథం): చట్ట సభల్లో అర్థవంతమైన చర్చలకు పెట్టింది పేరు కీ.శే. కొణిజేటి రోశయ్య అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం బైపాస్‌లోని వాసవీ భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కీ.శే.కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. రోశయ్యతో ప్రత్యేకమైన అనుబంధం లేకపోయినా.. వారి గొప్పతనం, అర్థవంతమైన చర్చలు నేటి యువ నాయకులకు ఆదర్శప్రాయం అన్నారు. ఒకప్పుడు రోశయ్య, పుచ్చలపల్లి సుందరయ్య, గౌతు లచ్చన్న లాంటి వారి హయాంలో అర్థవంతమైన చర్చలు జరిగేవి. ప్రజా సమస్యలపై చర్చించేవారు. కానీ నేడు అర్థవంతమైన చర్చలు లేకపోగా.. విమర్శలతో సమయం సరిపోతోంది. మచిలీపట్నంలో వ్యాపార రంగంలోని ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తాం. మచిలీపట్నంలో ఆర్యవైశ్యులు కొన్న రకాలైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు అవసరమైన మేరకు చర్యలు తీసుకుంటానని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిన్ని రామసత్యన్నారాయణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బాబా ప్రసాద్, విగ్రహ దాతలు చల్లపల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కనకమహాలక్ష్మి జాతర ప్రారంభం



చీపురుపల్లి (చైతన్యరథం): ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం విజయనగరం జిల్లా చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర అట్టహాసంగా ఆదివారం తెల్లవారుజామున 1.45 గంటలకు ప్రారంభమైంది. చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు దంపతులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు మొదటి పూజ నిర్వహించి జాతరను సాంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ ఛైర్మన్ గవిడి నాగరాజు, ఈవో ఎస్ నానాజీబాబు, అర్చకులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానికి అర్ధరాత్రి నుంచి అధిక సంఖ్యలో బారులుతీరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రౌతు కామ నాయుడు, రౌతు కాంతమ్మ, బలగం వెంకటరావు. విసినిగిరి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కేశినేని ఫౌండేషన్ ద్వారా రైతులకు ఆర్గానిక్ వ్యవసాయంపై సమగ్ర శిక్షణ

◆ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆర్గానిక్ రైతోత్సవం

◆ రైతోత్సవం- మేళా 2026ను ప్రారంభించిన ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): కేశినేని ఫౌండేషన్ ద్వారా ఎన్టీఆర్ జిల్లాలో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా విస్తృత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ ప్రకటించారు. జిల్లాలోని 16 మండలాల్లో మండలాల వారీగా మూడు రోజుల సమగ్ర శిక్షణ శిబిరాలు నిర్వహించి రైతులను ఆర్గానిక్ వ్యవసాయం వైపు మళ్లించేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఆర్గానిక్ రైతోత్సవం, నేచురల్ ఫార్మింగ్ మేళా- 2026కు ఎంపి కేశినేని శివనాథ్ ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమానికి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లకు కలెక్టర్ లక్ష్మీశా స్వాగతం పలికారు. సభానంతరం స్వచాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకరన్‌లను ఎంపీ కేశినేని శివనాథ్ సన్మానించగా, ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలెక్టర్ లక్ష్మీశా సన్మానించారు.

అంతకు ముందు స్టేడియంలో ఏర్పాటు చేసిన సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ స్టాళ్లు, సేంద్రియ సాగుకు సంబంధించిన ఉత్పాదితాల ప్రదర్శనలను ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షురాలు గద్దె అనురాధ, రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్, ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకరన్, ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజులతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ సందర్శించారు. ఆ స్టాల్స్ ఏర్పాటు చేసిన ఉత్పత్తుల యాజమాన్యులతో ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాబోయే రెండు నెలల్లో అగ్రికల్చర్, హార్టికల్చర్, యానిమల్ హస్బెండరీ తదితర ఐదు విభాగాల సమన్వయంతో ప్రతి మండలంలో మూడు రోజుల వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మే నెల నుంచి ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. దేశంలోని ప్రముఖ వ్యవసాయ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి రైతులకు అవగాహన తరగతులతోపాటు ప్రాక్టికల్ శిక్షణ అందిస్తామని చెప్పారు.

వర్క్‌షాప్‌లలో మొదటి రోజు అవగాహన తరగతులు, రెండో రోజు ఫీల్డ్ విజిట్, మూడో రోజు ఉత్తమ ప్రాక్టీషనర్లతో ప్రత్యేక శిక్షణ నిర్వహించనున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ (ఎన్.ఐ.ఆర్.డి)లో కేశినేని ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే సుమారు 1200 మందికి వివిధ ఉత్పత్తులపై శిక్షణ ఇప్పించగా, అందులో 150 మందికి ప్రత్యేకంగా ఆర్గానిక్ వ్యవసాయంపై శిక్షణ ఇప్పించటం జరిగిందన్నారు.

# మచిలీపట్నంలో పార్టీ శాశ్వత భవనం

◆ శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, టీడీపీ నేతలు



మచిలీపట్నం (చైతన్యరథం): కృష్ణాజిల్లా తెలుగుదేశంపార్టీ నూతన కార్యాలయం శంఖుస్థాపన కార్యక్రమంలో పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మచిలీపట్నంలో పార్టీ శాశ్వత భవనానికి శంకుస్థాపన చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. దశాబ్దాల తర్వాత శాశ్వత కార్యాలయం ఏర్పాటు చేసుకోవడం ద్వారా జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసే అవకాశం కలిగింది. జిల్లాలోని ప్రతి కార్యకర్త పండుగలా ఈ వేడుకలో పాల్గొనడం సంతోషంగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా టీడీపీ అధ్యక్షులు గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, ఏమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, మాజీ ఎమ్మెల్యే ఏపీఎస్‌డబ్ల్యు సీ చైర్మన్ రావి వెంకటేశ్వరావు, మాజీ ఎమ్మెల్యే బూరగడ్డ వెధవ్యాస్, మాజీ ఏమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్, రాష్ట్ర బీసీ నాయకులు, రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శాసనమండలిలో వైసీపీ తీరుపై ఎమ్మెల్యే యార్లగడ్డ ఆగ్రహం

◆ టీడీపీ నూతన కార్యాలయానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ



మచిలీపట్నం (చైతన్యరథం): కృష్ణా జిల్లాలోని మచిలీపట్నంలో నూతన జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వేద పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, జిల్లా టీడీపీ అధ్యక్షులు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు కాగిత కృష్ణ ప్రసాద్, బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం కోసం నిర్మిస్తున్న కార్యాలయానికి తన వంతు సహకారంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. భూమి పూజ అనంతరం మచిలీపట్నం జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో యార్లగడ్డ మాట్లాడుతూ... శాసనమండలి సమావేశాల్లో వైసీపీ సభ్యుల ప్రవర్తన అత్యంత అమానుషంగా ఉందని మండిపడ్డారు. పవిత్రమైన వేంకటేశ్వర స్వామి ఫోటోలను రాజకీయ నిరసనలకు వాడుకోవడం, సభలోకి తీసుకురావడం హిందూ ధర్మంపై దాడి చేయడమేనని ధ్వజమెత్తారు. జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతోనే ఎమ్మెల్సీలు ఇటువంటి వికృత చేష్టలకు పాల్పడ్డారని, ఇది కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో టీటీడీని అపవిత్రం చేయడమే కాకుండా, లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడి మహా అపరాధానికి పాల్పడ్డారని విమర్శించారు. గత ఐదేళ్లలో ఒంగోలు జాతి పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం వేల సంఖ్యలో మాత్రమే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# దేవుడి చిత్రపటాలతో రాజకీయాలు తగవు

◆ వైసీపీ తీరుపై కృష్ణ జిల్లా టీడీపీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి మండిపాటు



విజయవాడ (చైతన్యరథం): శాసన మండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాలను రాజకీయ ప్లకార్డుల్లా ఉపయోగించడం, అనంతరం వాటిని నిర్లక్ష్యంగా వదిలేయడం సరికాదని, చిత్రపటాలతో రాజకీయాలు తగవని కృష్ణ జిల్లా టీడీపీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి విమర్శించారు. శాసన మండలిలో వైసీపీ సభ్యులు తీరును నిరసిస్తూ ఆదివారం కృష్ణ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ జిల్లా టీడీపీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ ... శ్రీవారి దేవుడి చిత్రాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. హిందువుల ఆరాధ్య దైవాల చిత్రపటాలను శాసన మండలిలో ప్లకార్డుల్లా ప్రదర్శించి, నిరసన ముగిసిన తరువాత ఆ చిత్రాలను కుర్చీలు, టేబుళ్లపై వదిలేసి వెళ్లిపోవడం మరింత అవమానకరమని అయన విమర్శించారు.

**గనులు, భూగర్భ ,ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర మాట్లాడుతూ...** జగన్ డైరెక్షన్‌లో వైసీపీ ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు అత్యంత బాధాకరమని విమర్శించారు.తప్పు చేసి దొరికిపోయిన తర్వాత కూడా రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. శ్రీవారితో పెట్టుకుంటే కాలం ఏవిధంగా శిక్షిస్తుందో ఊహించలేం.

**శాసన మండలి సభ్యులు మరియు చీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ...** దేవదేవుని చిత్రాలను రాజకీయ వేదికగా మార్చడం వైసీపీ నేతల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. జగన్ డైరెక్షన్‌లో వైసీపీ ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు అత్యంత బాధాకరమని విమర్శించారు.

**గన్నవరం శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ...** హిందూ మత విశ్వాసాలను కించపరిచే విధంగా వ్యవహరించడం ప్రజలు సహించరన్నారు. దేవుడి చిత్రాలను ప్లకార్డులుగా ఉపయోగించడం మాత్రమే కాకుండా, వాటిని నిర్లక్ష్యంగా విసిరేయడం హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని తెలిపారు.

**గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము మాట్లాడుతూ...** తప్పు చేసి దొరికిపోయిన తర్వాత కూడా రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. వైసీపీ నేతలు బహిరంగ క్షమాపణలు చెప్పి తమ తప్పును ఒప్పుకోవాలి” అని ఆయన డిమాండ్ చేశారు.

**ఏపీ రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ...** జగన్మోహన్ రెడ్డి, వైసీపీ నేతలకు వెంకటేశ్వరస్వామి మీద నమ్మకం లేదు.హిందువుల మీద వైసీపీ చూపేది కేవలం కపట ప్రేమ మాత్రమే.వైసీపీ ఐదేళ్ల పాలనలో అడుగడుగునా టీటీడీ ప్రతిష్టను దిగజార్చారు.శ్రీవారితో పెట్టుకుంటే కాలం ఏవిధంగా శిక్షిస్తుందో ఊహించలేం.

**డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ...** జగన్మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు కూడా శ్రీవారి ఆలయ ప్రతిష్టను దెబ్బతీశారు. గతంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సైతం శ్రీవారి దర్శనానికి వెళ్లిన సమయంలో మాడవీధుల్లో చెప్పులతో తిరిగి వెంకటేశ్వరస్వామి ఆలయ నియమనిష్టలకు నీళ్లొదిలారు.

**బీజేపీ జిల్లా అధ్యక్షులు తాతినేని శ్రీరామ్ మాట్లాడుతూ...** జేబులు నింపుకోవడం కోసమే జగన్ పాలనలో టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరాకు గేట్లు తెరిచారు. లడ్డూ కల్తీ చేసే ఉద్దేశంతోనే జగన్మోహన్‌రెడ్డి, ఆనాటి టీటీడీ చైర్మన్లు నెయ్యి సేకరణ నిబంధనలను ఇష్టారీతిన మార్చేశారు.

# సీఎం చంద్రబాబుకు డేగల ప్రభాకర్ ఘనస్వాగతం



గుంటూరు (చైతన్యరథం): కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియా మరియు కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌లకు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం గుంటూరు నుంచి కాజా టోల్ ప్లాజా వరకు సుమారు 70 కార్లతో భారీ వాహన ర్యాలీ నిర్వహించారు. కాజా టోల్ ప్లాజా వద్ద కేంద్ర మంత్రిని పూలమాలలు, శాలువాలతో ఆత్మీయంగా ఆహ్వానించారు. అనంతరం అక్కడి నుంచి సభస్థలం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, ఘన స్వాగతం పలికారు. ర్యాలీలో కూటమి నాయకులూ, కార్యకర్తలు, అభిమానులు, టీం డేగల అభిమానులు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సభస్థలం వరకు ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా కొనసాగింది.

## కాణిపాకం ఆలయాన్ని ప్రసాద్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు కృషి



కాణిపాకం: పర్యాటక, ఆలయాల అభివృద్ధి కోసం కేంద్రం ప్రవేశపెట్టిన 'ప్రసాద్' పథకం పరిధిలో కాణిపాకం ఆలయాన్ని చేర్చేందుకు తన వంతు కృషి చేస్తానని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారిని మాజీ ఎంపీ గల్లా జయదేవ్ తో కలిసి ఆయన దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న కేంద్ర మంత్రికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, ఆలయ చైర్మన్, ఈవో, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, ప్రపంచస్థాయి పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా మారిందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. భగవంతుడి ఆశీస్సులు కూటమి ప్రభుత్వంపై ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.

## మాంస విక్రయ కేంద్రాల్లో చంద్రదండు ఆకస్మిక తనిఖీలు

తిరుపతి (చైతన్యరథం): నగరంలోని మాంస విక్రయ కేంద్రాలను ఏపీ మాంసాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ చంద్రదండు ప్రకాష్ ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. తిరుపతి నగరంలోని బైరాగిపట్టెడ, ఎంఆర పల్లె, కోర్లగుంట, లీలా మహల్ సెంటర్లో ఉన్న మాంస విక్రయ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశుభ్రమైన వాతావరణంలో ఆరోగ్యకరమైన మాంసాన్ని విక్రయించాలని దుకాణదారులకు సూచించారు. ప్రమాణాలు పాటించకుండా వాటిని విక్రయిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏపీ మీట్ కార్పొరేషన్ సిబ్బంది, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జగదీష్ తదితరులు ఉన్నారు.



## కులాల మధ్య చిచ్చు పెట్టడమే అంబటి లక్ష్యం

• సైకో జగన్ ఆదేశాల మేరకే రాంబాబు కుల డ్రామాలు : టీడీపీ రాయపాటి అమృతరావు

గుంటూరు (చైతన్యరథం) : అన్నదమ్ములుగా కలిసి ఉన్న కాపు, కమ్మ కులాల మధ్య చిచ్చు పెట్టడమే వైసీపీ నేత అంబటి రాంబాబు లక్ష్యమని టీడీపీ నేత రాయపాటి అమృతరావు మండిపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తల్లిని, ఇంట్లో ఆడవారిని నోటికొచ్చినట్లు తిట్టిన అంబటి రాంబాబు కనీసం పశ్చాత్తాపం లేకుండా టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని అన్నారు. అంబటి రాంబాబు ఇంటిపై టీడీపీ శ్రేణులు మొదటి దాడులకు పాల్పడలేదని, కానీ కులాలను లాగుతూ టీడీపీ శ్రేణులపైనే దాడికి పాల్పడ్డారని అన్నారు. "ఆ రోజు సమారు 2,000 మంది అక్కడికి స్వచ్ఛందంగా వస్తే అందరిని కూలానికి అంటగట్టడం ఎంత వరకు సమంజసం. గతంలో మా కాపు సోదరులు గురించి ఏమి మాట్లాడేవో మరచిపోయావా రాంబాబు. మా అన్నలైన కాపు సోదరులను ఏవిధంగా పోలిచావో ఈ సమాజం ఎప్పటికి మరిచిపోదు. త్రాగాటానికి, మాంసం తింటానికి తప్ప దేనికి మా సోదరలు పనికిరారు అని నువ్వు అన్నది నిజం కాదా. ఒక కాపుగా పుట్టినందుకు సిగ్గుపడుతున్నావు అంటూ వ్యాఖ్యాలు చేసింది నువ్వు కాదా?", అని రాయపాటి అమృతరావు ప్రశ్నించారు. సైకో జగన్ ఆదేశాలు మేరకే అన్నదమ్ముళ్లుగా కలిసి ఉన్న కాపు, కమ్మ కులాల మధ్య చిచ్చుపెట్టె ప్రయత్నం చేయడం దారుణమన్నారు. అంబటి రాంబాబు ఎన్ని కుతంత్రాలు చేసినా, కుట్రలు పన్నినా కాపులు, కమ్మలు అన్నదమ్ముళ్ల లాగే కలిసి ఉంటామన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ పర్మిషన్ లేని ర్యాలీలు అందరిని రెచ్చగొట్టే పదజాలతో ఈ వయసులో కూడా మట్లాడటం సరికాదని, కాపులు సైతం అంబటి రాంబాబు వ్యవహారశైలిని ఛీ కొడుతున్నారని అన్నారు. ఇప్పటికైన అంబటి రాంబాబు తన పద్ధతి మార్చుకోకపోతే భవిష్యత్తులో మరింత మూల్యం చెల్లించుకోక తప్పదని రాయపాటి అమృతరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి పేరయ్య యాదవ్,కాపు యువనాయకులు ఏపూరి శ్యామ్,గుంటూరు మిర్చి యార్డ్ డైరెక్టర్ బత్తుల జాన్ సైదా,గుంటూరు జిల్లా తెలుగువిద్యార్థి ఉపాధ్యక్షులు ప్రశాంత్ గౌడ్, మైనార్టీ నాయకులు షేక్ మస్తాన్, పెదకూరపాడు నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు పరిశ యువ గణేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవారిని సైతం రాజకీయాల్లోకి లాగడం దుర్మార్గం



ఒంగోలు (చైతన్యరథం): చట్టసభల్లో తిరుమల శ్రీవారిని అవమానిస్తూ వైసీపీ నాయకులు వ్యవహరించిన తీరు దుర్మార్గమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు వ్యాఖ్యానించారు. ఒక పథకం ప్రకారమే హిందూ మతంపై జగన్ దాడి చేస్తున్నారని, శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి కలిపి వందల కోట్లు దోచుకున్నారని, ఈవిషయాన్ని పక్కదారి పట్టించేందుకే శ్రీవారిని సైతం రాజకీయాల్లోకి లాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మంత్రి డోలా బాల వీరంజనేయస్వామి, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు కనిగిరి శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డిలతో కలిసి దామచర్ల జనార్ధన్‌రావు మీడియాతో మాట్లాడుతూ... అత్యున్నత చట్టసభలో శాసన మండలిలో శ్రీవేంకటేశ్వర స్వామివారి చిత్రపటాల పట్ల వైసీపీ నాయకులు ప్రదర్శించిన నిర్లక్ష్య వైఖరి భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని తెలిపారు. దేవుడి చిత్రపటాలను బూట్లు, చెప్పులతో పట్టుకోవడం, అనంతరం వాటిని నిర్లక్ష్యంగా విసరడం అత్యంత హేయమైన చర్య, ప్రజల విశ్వాసాలు, ఆధ్యాత్మిక విలువలు మరియు సంప్రదాయాలను గౌరవించడం ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి బాధ్యత అని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు మరియు మత సామరస్యాన్ని దెబ్బతీసే విధానాలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అన్ని మతాలను గౌరవిస్తూ సమాజంలో శాంతి, సామరస్యాన్ని కాపాడటం మనందరి బాధ్యత. మీడియా ఈ అంశాన్ని బాధ్యతాయుతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరుతున్నాను అన్ని తెలియజేశారు. మీడియా సమావేశంలో వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రవర్తించిన తీరును స్క్రీన్ మీద వేసి ప్రదర్శించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యర్రగొండపాలెంలో 17 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

యర్రగొండపాలెం (చైతన్యరథం): ఆర్థిక సమస్యలు ఉన్నా కూడా సీఎం చంద్రబాబు మీ అందరికీ ఆర్థిక సహాయం అందిస్తున్నారని, మీరు మేలు మరవకుండా చంద్రబాబుతో పాటు తనకు అండగా నిలవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు వ్యాఖ్యానించారు. మార్కాపురం జిల్లా యర్రగొండపాలెంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 117 మంది రూ.75 లక్షల విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. వివిధ ఆరోగ్య సమస్యలతో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందిన పలువురు గూడూరి ఎరిక్షన్‌బాబును కోరగా ఆయన సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందేలా సీఎం కార్యాలయానికి సిఫార్సు చేశారు. అక్కడ నుంచి వచ్చిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం ఎరిక్షన్‌బాబు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



## కావలిలో 53 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

•రూ.43.20 లక్షల ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి



కావలి (చైతన్యరథం): నెల్లూరు జిల్లా,కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం 53 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.43,20,856 విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను కావలి కావ్య కృష్ణారెడ్డి పంపిణీ చేశారు. వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపశమనంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత 21 నెలల్లో కావలి నియోజకవర్గంలో 1018 మందికి మొత్తం రూ. 8,21,26,116 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ అందజేశామని తెలిపారు. సీఎం సహాయ నిధి పంపిణీలో కావలి నియోజకవర్గం రాష్ట్రంలోనే మూడవ స్థానంలో నిలవడం గర్వకారణమని అన్నారు.వైద్య సహాయం విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని, పేదలకు అత్యవసర సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. సీఎం ఆశీస్సులతో కావలి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మంపై వైసీపీ ప్రణాళికతో దాడి

ఏలూరు (చైతన్యరథం): వైసీపీ జగన్ దర్శకత్వంలో ఒక ప్రణాళిక ప్రకారం కొంతకాలంగా దాడులు చేస్తున్నారని రాష్ట్రంలో మతసామరస్యాన్ని దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారని పశ్చిమగోదావరి జిల్లా టిడిపి అధ్యక్షుడు ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు ధ్వజమెత్తారు. పశ్చిమగోదావరి జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో టిడిపి, జనసేన, బిజెపి అధ్యక్షుల సంయుక్త పాత్రికేయ సమావేశంలో మంతెన రామరాజు మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామికి జరిగిన అపచారాన్ని ప్రజలకు తెలియజేయడంతో పాటు భవిష్యత్తులో మరే మతానికి ఇలా జరగకుండా సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ హిందూ ధర్మంపై వైసీపీ జగన్ దర్శకత్వంలో కొంతకాలంగా దాడులు జరుగుతున్నాయని వైసీపీ ప్రభుత్వ హయాంలో 300 పైగా హిందూ ఆలయాలపై దాడులు జరిగిన రథాలు తగలబెట్టిన జగన్ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమల పరకామణి చోరీ, పవిత్ర లడ్డు మహాప్రసాదాలలో కల్తీ నెయ్యి వినియోగం ఇప్పుడు ఏకంగా వెంకటేశ్వర స్వామినే రాజకీయాల్లోకి తీసుకువచ్చి మండలిలో వైసీపీ ప్రజా ప్రతినిధులు చెప్పులు, బూట్లు ధరించి స్వామి వారి చిత్రపటాన్ని గాల్లోకి ఊపుతూ అవహేళన చేస్తూ తరువాత పక్కకు పడేయడం దారుణమని మండిపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి మాట్లాడుతూ దేవుడి చిత్రపటాలను అడ్డుపెట్టుకొని వైసీపీ నేతలు రాజకీయం చేయడం వారి దిగజారుడుకు నిదర్శనం మన్నారు. జగన్ సూచనతో వారు వ్యవహరించిన తీరు అత్యంత బాధాకరమని హిందూ మత విశ్వాసాలను కించపరిస్తే ప్రజలు సహించరన్నారు. వైసీపీ జగన్ పాలనలో టీటీడీ దేవస్థానంలో అన్యమతస్తుల నియామకం, ఆర్టీసీ బస్సు టికెట్లపై అన్యమత ప్రచారం, తిరుమల కొండపై అన్యమత గుర్తు, టీటీడీ వెబ్ సైట్ లో అన్యమత బోధనలు, దర్శనం, వసతి అద్దె, టోల్, లడ్డు ప్రసాదాల ధరలు పెంచడంతోపాటు అనేక ఘటనల తిరుమల పవిత్రతకు దెబ్బతీసేయన్నారు.

# 332వ ఉరుసు మహెూత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ



కర్నూలు (చైతన్యరథం): కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం గంజహళ్లి గ్రామంలో మహాత్మ బడే సాహెబ్ 332వ ఉరుసు మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీ.వి జయనాగేశ్వరరెడ్డితో కలిసి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. ఉరుసు సందర్బంగా దర్గాకు చేరుకున్న ఎంపీ నాగరాజుకి, ఎం.ఎల్.ఏ నాగేశ్వరరెడ్డికి దర్గా పిఠాధిపతులు ముస్లిం సంప్రదాయ పద్దతిలో స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అంతకు ముందు గ్రామానికి విచ్చేసిన ఎంపీకి, ఎమ్మెల్యేకి టీడీపీ శ్రేణులు, గ్రామస్థులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దర్గా పిఠాధిపతులు మహబూబ్ బాషా, సయ్యద్ చిన్న ముద్దుగోల్, రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు చైర్మన్ మల్లప్ప, గోనెగండ్ల మండలం టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కల్తీ నెయ్యి వ్యవహారాన్ని కప్పిపుచ్చడానికే వైసీపీ డ్రామాలు

**●తీవ్రంగా మండిపడ్డ ధర్మవరం కూటమి నేతలు**




ధర్మవరం (చైతన్యరథం): కల్తీ నెయ్యి వ్యవహారాన్ని కప్పిపుచ్చడానికే వైసీపీ నేతలు శాసనమండలిలో డ్రామాలాడుతున్నారని కూటమి నేతలు తీవ్రంగా మండిపడ్డారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో కూటమి నేతలు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు, వరుణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, కూటమి పార్టీల నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్చుకోలేక వైసీపీ నేతలు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడని, ప్రజలు బుద్ధి చెప్పిన ఇంకా బుద్ధి రాలేదని మండిపడ్డారు. శాసనమండలిలో వైసీపీ సభ్యులు కల్తీ నెయ్యి వ్యవహారాన్ని కప్పిపుచ్చడానికి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని, దేవదేవుని చిత్రపటాన్ని చెప్పులు వేసుకుని ప్రదర్శిస్తారా అని మండిపడ్డారు. భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని, దేవుడంటే భయం లేదని, గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి తిరుమలకు ఏడుకొండలు ఎందుకు రెండు కొండలు చాలన్నందుకు గాలిలో కలిసిపోయారని పేర్కొన్నారు. రప్ప రప్ప, బట్టలు విప్పి కొడతామనే భాష మాట్లాడుతున్నారని ప్రజలు మీరు మాట్లాడుతున్న బాష చూసి అసహ్యించుకుంటున్నారని, శాసనసభలో 11 మంది సభ్యులు 11 నిమిషాలు కూడా ఉండకుండా బయటకు వెళ్లిపోయారని, మీకు దమ్ము ధైర్యం ఉంటే శాసన సభకు రావాలని ప్రజా సమస్యలపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఒకవైపు పోలవరం నిర్మాణం మరోవైపు రాజధాని నిర్మాణం, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, అభివృద్ధి సంక్షేమంలో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తుంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే ఓర్చుకోలేని మీరు నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఆ దేవుడే మీకు శిక్ష వేసే సమయం దగ్గరలో ఉందని పేర్కొన్నారు. ఆ దేవదేవుని అవమానిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నీవు క్రిస్టియన్ మతాన్ని ప్రోత్సహిస్తూ హిందూ మతాన్ని దెబ్బతీస్తున్నారు. కానీ కూటమి ప్రభుత్వం అన్ని మతాలను అన్ని కులాలను సమానంగా ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, టీడీపీ జిల్లా కార్యదర్శి తాజుద్దీన్, టీడీపీ జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి నాయుడు, మాజీ గ్రంథాలయ చైర్మన్ జిరాయితీ గౌస్ మోద్దిన్, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ ఇమామ్ హుస్సేన్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ ఈశ్వర్, కుమ్మరి కార్పొరేషన్ డైరెక్టర్ నాగేంద్ర, కుమార్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విజయ్, బీజేపీ నాయకుడు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారిని రాజకీయాలకు వాడుకోవడం దారుణం



కర్నూలు (చైతన్యరథం): వైసీపీ నాయకులు వేంకటేశ్వరస్వామిని రాజకీయాలకు వాడుకుంటున్నారని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. కర్నూలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ మాట్లాడారు. వైసీపీ హయాంలో తిరుమలలో అన్యమత ప్రచారం జరిగింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గతంలో భూమన కరుణాకర్ రెడ్డి ఏడు కొండల గురించి ఏ విధంగా మాట్లాడారో శబరి గుర్తుచేశారు. వైసీపీ నాయకులు ఎక్కడికి వెళ్లినా వేంకటేశ్వరస్వామి గుర్తుకు వచ్చే రోజులు వస్తాయని ఎంపీ అన్నారు.

# పారిశ్రామికంగా పెరిగిన వెండి వాడకం

**● సోలార్ ఎనర్జీ ప్యానల్ తయారీలో వెండి వినియోగం... భవిష్యత్తులో రాగికి భారీగా డిమాండ్**



ప్రపంచవ్యాప్తంగా సిల్వర్ మార్కెట్లో నెంబర్ వన్ దేశం ఏదైనా ఉంది అంటే అది చైనా అని చెప్పవచ్చు. ఎందుకంటే గత సంవత్సరంలో చైనా నుండి అత్యధికంగా వెండి ఎగుమతి జరిగింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్ అనుగుణంగా ఈ పరిణామం చోటు చేసుకున్నట్లు చెప్పవచ్చు. ప్రపంచంలోనే అత్యధికంగా వెండిని ఉపయోగించే దేశాలలో చైనా రెండవ స్థానంలో ఉండగా, అదే సమయంలో ముడి వెండి ఖనిజాన్ని శుద్ధిచేసి ఎగుమతి చేయడంలో కూడా చైనా ముందు స్థానంలోనే ఉంది. అయితే గడచిన 15 సంవత్సరాలుగా ప్రపంచ వెండి మార్కెట్లో చైనా ఒక ప్రధాన స్థానంలో ఉంది అని చెప్పవచ్చు. ప్రస్తుతం వెండి ధర భారీగా పెరిగిన నేపథ్యంలో ఈ ధరలను నిర్ణయించడంలో చైనా కీలక పాత్ర పోషిస్తుంది అని చెప్పవచ్చు. అయితే వెండి ధర భారీగా పెరగటం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఒక సరికొత్త పరిణామం చోటుచేసుకుంది అని చెప్పవచ్చు. ముఖ్యంగా యూరప్, అలాగే అమెరికా వంటి దేశాలలో సాధారణ ప్రజలు తమ ఇళ్లల్లో ఉండే సిల్వర్ వస్తువులను పెద్ద ఎత్తున విక్రయించడం ప్రారంభించారు. వెండిని కొనుగోలు చేసే తాకట్టు దుకాణాల ముందు పెద్ద ఎత్తున జనం వెండి సామాన్లతో క్యూ కట్టి మరీ డబ్బులను పొందడం చూడవచ్చు. ఓవైపు జనం వెండి సామాన్లను మా బహిరంగ మార్కెట్లో అమ్మివేసి డబ్బులను పొందుతుంటే, మరోవైపు పారిశ్రామిక మార్కెట్లో మాత్రం వెండికి భారీగా డిమాండ్ పెరగడం ఇక్కడ అసలైన కారణంగా చెప్పవచ్చు. పరిశ్రమలు వెండిని కొనుగోలు చేయడానికి పెద్ద ఎత్తున తాపత్రయ పడుతున్నాయి. అందుకు తగ్గట్టుగా రిఫైడరీలు కూడా ఆ డిమాండున్ అందుకోలేక పోతున్నాయి. దీనంతటికీ ముఖ్య కారణం సోలార్ శక్తికి ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్ కారణంగానే వెండి వాడకం పారిశ్రామికంగా భారీగా పెరిగింది అని నిపుణులు పేర్కొంటున్నారు.



**సోలార్ ఎనర్జీతో వెండికి రెక్కలు**

వెండి ధరలు భారీగా పెరిగేందుకు దారి తీసిన అత్యంత ముఖ్యమైన కారణం సోలార్ తయారీ రంగంలో వెండి వాడకం పెరగడమే అని చెప్పవచ్చు. సాధారణంగా సోలార్ ప్యానల్స్ తయారీలో వెండిని ఎక్కువగా ఉపయోగిస్తారు. 2025 సంవత్సరంలో సుమారు 196 మిలియన్ ఔన్సుల వెండిని సోలార్ ప్యానల్స్ తయారీలో వాడినట్లు నివేదికలు చెబుతున్నాయి. బహిరంగ మార్కెట్లో వెండి డిమాండ్‌లో 5వ వంతు సోలార్ ఎనర్జీ ఉత్పత్తిలోన ఉపయోగిస్తున్నారు. మరోవైపు వెండి డిమాండ్ భారీగా పెరుగుతున్న నేపథ్యంలో వెండికి ప్రత్యామ్నాయంగా మరొక లోహంతో సోలార్ ప్యానల్స్ తయారు చేసేందుకు కూడా రీసెర్చ్ సంస్థలు ప్రయత్నం చేస్తున్నాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా సోలార్ ఎనర్జీ వాడకం కోసం పెరుగుతున్న డిమాండ్ కారణంగా వెండి డిమాండ్ ను తగ్గించలేకపోతున్నారు. 2030 నుంచి 2050 మధ్యకాలంలో ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఏవైతే బొగ్గును మండించి థర్మల్ విద్యుత్తును జీరోకు చేర్చే నెట్ జీరో లక్ష్యాన్ని అందుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా కనీసం 630 గిగావాట్ల సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ అంచనా వేసింది.

ముఖ్యంగా ఈ డిమాండ్ ఎక్కువగా చైనాలోనే ఎక్కువగా ఉంది. చైనాలో ఇప్పటికే సోలార్ ప్యానల్స్ గరిష్ట స్థాయికి చేరుకుంటున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఓవైపు ఎలక్ట్రిక్ వాహనాల డిమాండ్ పెరగడంతో పాటు ఏఐ డేటా సెంటర్లకు కూడా సోలార్ విద్యుత్తు అవసరం ఎక్కువగా ఉంది దీంతో వెండి డిమాండ్ అనేది మరింత భారీగా పెరిగింది అని చెప్పవచ్చు. ఇదిలా ఉంటే ప్రస్తుతం వెండి వాడకం తగ్గించేందుకు భవిష్యత్తులో రాగి లోహం ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేసేందుకు శాస్త్రవేత్తలు ప్రయోగాలు జరుపుతున్నారు. అయితే కాపర్ మాత్రమే కాదు ఇతర లోహాలను కూడా వెండికి ప్రత్యామ్నాయంగా భవిష్యత్తులో అభివృద్ధి చేసినట్లయితే వెండి ధర తగ్గి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరోవైపు వెండి ధర భారీగా పెరగడానికి మరో ప్రధాన కారణం చైనా ఎగుమతులను నియంత్రణ చేయడం కూడా చూడవచ్చు.

# శ్రీవారి పట్ల వైసీపీ నేతల ప్రవర్తన దైవద్రోహం

**●రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు మండిపాటు**



మదనపల్లె (చైతన్యరథం): శాసనమండలిలో వైసీపీ సభ్యులు వ్యవహరించిన తీరుపై రాజంపేట పార్లమెంట్ టీడీపి అధ్యక్షులు మరియు టీటీడీ మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా, బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, జనసేన రాయలసీమ కో కన్వీనర్ రామదాస్ చౌదరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మదనపల్లిలోని పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. అపచారం – దైవద్రోహం: చరిత్రలో ఎన్నడూ లేని విధంగా శాసనమండలిలో శ్రీవారి చిత్రపటాలను రాజకీయ నిరసనలకు వాడటం అత్యంత బాధాకరం. కాళ్లకు బూట్లు వేసుకుని స్వామివారి ఫోటోలు పట్టుకోవడం హిందూ సమాజాన్ని అవమానించడమే. జగన్ సంతృప్తి కోసమేనా?: జగన్మోహన్ రెడ్డి కళ్లలో ఆనందం చూడటం కోసం వైసీపీ నేతలు ఇంతటి నీచానికి ఒడిగట్టారు. మీరు అసలు వెంకటేశ్వర స్వామి భక్తులేనా అని ఆయన ప్రశ్నించారు. వరుస దాడులు: కల్తీ లడ్డూ వివాదం, టీటీడీలో అన్యమతస్థుల నియామకం వంటి చర్యలతో వైసీపీ మొదటి నుంచి హిందూ ధర్మంపై, తిరుమల పవిత్రతపై దాడి చేస్తూనే ఉందని మండిపడ్డారు. చర్యలు తీసుకోవాలి: తప్పు చేసిన సభ్యులను సస్పెండ్ చేయకుండా సభను వాయిదా వేయడం దురదృష్టకరం. భక్తుల మనోభావాలను పదే పదే దెబ్బతీస్తున్న వైసీపీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాజకీయ లబ్ధి కోసం దైవాన్ని ఆయుధంగా వాడుకోవడం మహా పాపమని, ఇలాంటి చర్యలను భక్తులు ఎప్పటికీ క్షమించరని సుగవాసి ప్రసాద్ బాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా, బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, జనసేన రాయలసీమ కో కన్వీనర్ రామదాస్ చౌదరి, రాష్ట్ర పాల ఏకిరి చైర్మన్ నాగేశ్వర్ నాయుడు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్ ఖాన్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దేవరింటి శ్రీనివాసులు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రామక్రిష్ణ ఆచారి, బీజేపీ సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, మదనపల్లి చైర్మన్ జంగాల శివరాం, యల్లంపల్లి ప్రశాంత్, పార్లమెంట్ ఉపాధ్యక్షురాలు తలారి రాధమ్మ, టీడీపీ నాయకులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

'నా కొడుకు చదువుకోవడానికి అమెరికా వెళ్లాడు. చదువు పూర్తయిన తర్వాత హెచ్1బీ వీసా రాలేదు. దీంతో రెండోసారి కూడా మాస్టర్స్ కోర్సు చదివాడు. ఎంత ప్రయత్నిస్తున్నా హెచ్1బీ వీసా మాత్రం రాలేదు. వాడు అమెరికా వెళ్లి ఎనిమిదేళ్లు అయ్యిందయ్యా. వాడు ఒకసారి ఇంటికొస్తే బాగుండు అనిపిస్తోంది. ఎప్పుడొస్తావ్ కన్నా అంటే.. ఇక్కడ పరిస్థితులు బాగోలేవమ్మా.. అక్కడికి వస్తే మళ్లీ తిరిగి వచ్చే అవకాశం ఉండదు. ఎలాగో ఇంతకాలం ఆగాను కదా.. ఇంకొంత కాలం ఎదురు చూస్తానమ్మా అంటున్నాడు. అమెరికా కొలువు లేకపోతే నష్టం లేదులే వచ్చేయ్ బిడ్డా అంటే కొద్ది నెలలు ఆగి వస్తా అమ్మా అన్నాడు' అన్న తల్లి.. ఇప్పుడు తన కొడుకు శవాన్ని చూడాల్సిన పరిస్థితి.




## హెచ్1బీ వీసా కోసం ఎదురుచూసీచూసీ...

- కార్డియాక్ అరెస్టుకు గురైన దొంతిరెడ్డి శశికాంత్ రెడ్డి
- హాస్పిటల్‌కు తరలించినప్పటికీ దక్కని ఫలితం
- అమెరికాలో అర్ధంతరంగా ముగిసిన తెలుగోడి జీవితం
- యువకుడి స్వస్థలం ఏపీలోని కర్నూలు జిల్లా అని సమాచారం
- మృతదేహం తరలింపు కోసం ఫండ్ రెయిజ్ చేస్తున్న స్నేహితులు

యూఎస్ఏ: అమెరికాలో ఓ తెలుగు యువకుడి జీవితం విషాదాంతమైంది. మాస్టర్స్ చేయడం కోసం 2018లో అమెరికా వెళ్లిన దొంతిరెడ్డి శశికాంత్ రెడ్డి అనే 30 ఏళ్ల యువకుడు కార్డియాక్ అరెస్ట్ కారణంగా ప్రాణాలు కోల్పోయాడు. 8 ఏళ్ల క్రితం అమెరికా వెళ్లిన తమ కొడుకు ఎప్పుడెప్పుడు తిరిగొస్తాడా.. అని ఎదురుచూస్తున్న శశికాంత్ తల్లిదండ్రులు ఇప్పుడు తమ బిడ్డ శవం కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి తలెత్తింది. శశికాంత్ మాస్టర్స్ పూర్తి చేసినప్పటికీ హెచ్1బీ వీసా రాలేదు. దీంతో మరోసారి మాస్టర్స్ డిగ్రీ చదివాడు. అయినా సరే హెచ్1బీ వీసా అందని ద్రాక్షగానే మిగిలింది. శశికాంత్ ఎంత కష్టపడినప్పటికీ మంచి విద్యార్హతలు ఉన్నప్పటికీ అదృష్టం కలిసిరాలేదు. ఎంత ప్రయత్నించినప్పటికీ హెచ్1బీ వీసా రాకపోవడం.. 8 ఏళ్లుగా తల్లిదండ్రులకు దూరంగా ఉండటం.. ఎక్కువ గంటలు పని చేయాల్సి రావడంతో శశికాంత్ తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. చివరకు ఫిబ్రవరి 16వ తేదీ తెల్లవారుజామున ఛాతీలో నొప్పిగా ఉందని ఫ్రెండ్స్‌కు చెప్పాడు. వారు వెంటనే అతడిని హాస్పిటల్‌కు తరలించారు. కానీ కాపాడుకోలేకపోయారు. దీంతో శశికాంత్ భౌతిక కాయాన్ని స్వదేశానికి పంపించడానికి, శశికాంత్ తల్లిదండ్రులకు అండగా ఉండటానికి అమెరికాలోని అతడి స్నేహితులు, అక్కడి తెలుగు సమాజం ప్రయత్నాలు మొదలు పెట్టింది. అందులో భాగంగా గోఫండ్‌మీ ద్వారా 50వేల డాలర్లు సేకరించడం కోసం ఫండ్ రెయిజ్ చేస్తున్నారు. శశికాంత్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా అని సమాచారం.



శశికాంత్ మరణం.. అమెరికాలో చదువుకోవడానికి, ఉద్యోగం చేయడానికి వెళ్లిన తెలుగు వాళ్లు ఎంతటి ఒత్తిడిలో ఉన్నారో చెప్పకనే చెబుతోంది. ఒకప్పుడు తల్లిదండ్రులు తమ కొడుకు లేదా కూతురు అమెరికాలో చదువుకోవడానికి వెళ్తే గొప్పగా ఫీలయ్యేవారు. అమెరికాలోనే జాబ్ తెచ్చుకుని అక్కడే సెటిలైపోతే వీళ్లు ఇక్కడ హ్యాపీగా ఫీలయ్యేవారు. కానీ ఇప్పుడు అమెరికాలో ఆ పరిస్థితులు లేవు. ఇప్పటికే అక్కడ చదువుకోవడానికి వెళ్లిన వారు హెచ్1బీ వీసాలు రాక.. చదువుకు తగ్గ ఉద్యోగాలు రాక.. తిరిగి ఇండియా రావడానికి మనసొప్పక.. మళ్లీ మాస్టర్స్ కోర్సుల్లో చేరుతున్నారు. అయినా సరే అక్కడ కొంత కాలమైనా మంచి ఉద్యోగం చేసే అవకాశం లేక తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు.

### డాలర్ల కోసం జీవితాన్ని బలిచేసుకోవద్దు

మంచి భవిష్యత్తు కోసం విదేశాల బాట పట్టిన విద్యార్థులు.. అక్కడి పరిస్థితులు మారిపోవడంతో డిప్రెషన్లోకి వెళ్లిపోతున్నారు. తిరిగి రాలేక, అక్కడే ఉండలేక నరకయాతన అనుభవిస్తున్నారు. గత ఏడాది నవంబర్లో గుంటూరుకు చెందిన ఓ డాక్టర్ అమెరికా వీసా రాలేదన్న మనస్తాపంతో హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న సంగతి ఇక్కడ ప్రస్తావనార్హం. తల్లిదండ్రులు సైతం వాస్తవాన్ని గుర్తించాల్సిన తరుణం ఇది. అమెరికాలో చేస్తేనే ఉద్యోగం.. డాలర్లు సంపాదిస్తేనే జీవితం అనే భ్రమ నుంచి బయటకు రావాలి. పక్కింటి అబ్బాయి వెళ్లాడు. మన బంధువులంతా అమెరికాలోనే ఉన్నారు.. మనోడు వెళ్లకపోతే ఎలా ఆలోచనలు మానేయాలి. అమెరికా వెళ్తే ఓకే... మంచి యూనివర్సిటీలో సీటు వస్తే ఓకే.. అక్కడ జాబ్ వస్తే డబుల్ ఓకే. అంతే కానీ అమెరికానే జీవితం అనే స్థాయికి వెళ్లొద్దు.

### రంగంలోకి ఏపీఎన్ఆర్‌టీఎస్

కాగా శశికాంత్‌రెడ్డి మరణ వార్తను మీడియా ద్వారా తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు అసోసియేషన్ (ఏపీఎన్ఆర్‌టీఎస్) రంగంలోకి దిగింది. అతడి వివరాలు తెలుసుకునేందుకు ఏపీఎన్ఆర్‌టీఎస్ ఛైర్మన్ రవి వేమూరి నేతృత్వంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) నాగేంద్రబాబు అక్కల యునైటెడ్ స్టేట్స్ ఎంబసీతో మాట్లాడుతున్నారు. మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.




## 'లాటా' మైల్స్ ఛాలెంజ్

### లాస్ ఏంజెల్స్‌లో మార్చి 8న ప్రారంభం

లాస్ ఏంజెల్స్: తెలుగు భాష, సేవ, యువత భవిష్యత్తు కోసం పాటుపడుతున్న లాస్ ఏంజెల్స్ తెలుగు అసోసియేషన్ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రవాస తెలుగు వారిలో ఆరోగ్య స్పృహను పెంపొందించడానికి 'లాటా మైల్స్ ఛాలెంజ్' పేరుతో 8 వారాల పాటు సాగే ఫిట్‌నెస్ పోటీలను నిర్వహించబోతున్నారు.

ప్రారంభం: మార్చి 8, 2026.

ముగింపు: మే 2, 2026.

ఛాలెంజ్ రకాలు (ఏదైనా ఒకటి మాత్రమే ఎంచుకోవాలి):

ఛాలెంజ్ 1 (300 మైళ్లు): రోజుకు సగటున 5.36 మైళ్లు లేదా 10.7వేల అడుగులు నడవాల్సి ఉంటుంది.

ఛాలెంజ్ 2 (450 మైళ్లు): రోజుకు సగటున 8 మైళ్లు లేదా 16వేల అడుగులు నడవాల్సి ఉంటుంది.

ఫీజు: ల్యాటా సభ్యులకు ప్రవేశం ఉచితం. సభ్యులు కాని వారికి కేవలం పది డాలర్లు ప్రవేశ రుసుము.

ఈ కార్యక్రమ విజయవంతం కోసం కింది సభ్యులు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారు.

పృథ్వీష్ కాసుల: 626-566-4918

ఆలేఖ్య గారికపర్తి: 615-975-3818

భార్గవి దేవిడి: 860-713-1336


ప్రతాప్ మెథరమిట్ట: 224-406-7096

సునీల్‌కుమార్ మల్లెల: 612-594-9444

ఆసక్తి కలిగిన వారు మరిన్ని వివరాల కోసం **www.latausa.org** వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి రిజిస్టర్ చేసుకోవచ్చు.

## వేడుకగా నాదెళ్ల గంగాధర్ ద్వితీయ కుమార్తె వివాహ నిశ్చితార్థం

### ఆశీర్వదించిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు, ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రముఖులు, ఎన్ఆర్ఐలు



హైదరాబాద్ (చైతన్యరథం): అందరివాడు, తానా మాజీ అధ్యక్షుడు గంగాధర్ నాదెళ్ల ద్వితీయ కుమార్తె శిల్ప-ఆలూరి సుహాస్ వివాహ నిశ్చితార్థ వేడుక హైదరాబాద్‌లోని హోటల్ దసపల్లాలో అంగరంగ వైభవంగా జరిగింది. అనేక మంది ఎన్ఆర్ఐలు, టీడీపీ, బీజేపీ నాయకులు, మంత్రులు,



అధికారులు విచ్చేసి కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు-భువనేశ్వరి దంపతులు శిల్ప-సుహాస్‌లను ఆశీర్వదించారు. ఎన్ఆర్ఐ నాయకుడు జయరాం కోమటి, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తెలుగు రాష్ట్రాల నాయకులు సుజనాచౌదరి, తుమ్మల నాగేశ్వరరావు, గరికపాటి మోహన్‌రావు, కేశినేని చిన్ని, పాతూరి నాగభుషణం, ధూళిపాళ్ల నరేంద్ర, ఎర్రబెల్లి దయాకర్‌రావు, యరపతినేని ప్రభాకర్, వసంత కృష్ణప్రసాద్, దేవినేని ఉమామహేశ్వరరావు, తొండపు జనార్దన్, బండ్ల గణేష్, ముత్తంశెట్టి శ్రీనివాస్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ కాబోయే జంటను ఆశీర్వదించారు. నగరానికి చెందిన ప్రముఖులు కేవీ రావు, నందమూరి రామ కృష్ణ, నందమూరి వసుంధర, అక్కినేని వెంకట్, ప్రసాద్ గారపాటి, అట్లూరి సుబ్బారావు నవీన్ ఎర్నేని, సాహు గారపాటి, రవిశంకర్ కంఠమనేని, సుబ్బారావు చెన్నూరి, మేడసాని మోహన్, మహాసేన రాజేష్, ఎన్ఆర్ఐలు జగదీష్ ప్రభల, శశి దొప్పలనేని, పెద్దిబోయిన, శ్రీకాంత్ దొడ్డపనేని, శ్రీధర్ చిల్లర వేడుకను తిలకించారు.



## చెన్నైలో విచిత్ర ఘటన!

**మహిళకు ఎముకలు, పుర్రె పార్శిల్**



పార్శిల్లో మనిషి పుర్రె, ఎముకలు వచ్చిన ఘటన చెన్నైలోని ప్యారిస్‌లో కలకలం రేపింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్యారిస్‌లోని ఓ దుకాణంలో వ్యాసర్పాడికి చెందిన శ్రుతి అనే మహిళ పని చేస్తున్నారు. ఆ దుకాణం సెక్యూరిటీ వద్దకు ఓ వ్యక్తి వచ్చి.. శ్రుతికి ఈ పార్సిల్ వచ్చిందని ఇచ్చి వెళ్లాడు. అనంతరం ఆమెకు సెక్యూరిటీ ఆ కవర్ను తీసుకెళ్లి ఇవ్వగా.. అది తనది కాదని.. తీసుకోనేందుకు నిరాకరించింది. దీంతో దుకాణ యజమాని అందరి సమక్షంలోనే పార్శిల్ తెరిచి చూశాడు. అందులో మనిషి పుర్రె, ఎముకలు, విభూది ఉండడం చూసి.. అందరూ దిగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శ్రుతి కుటుంబీకులకు, అదేషాపులో పనిచేసే దినేశ్ కుటుంబీకులకు గొడవలు ఉన్నాయని,ఈ నేపథ్యంలోనే ఆమెను భయపెట్టేందుకు అతను అలా చేసినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. దినేశ్, అతని అనుచరులు శ్రీనివాసన్, జోసెఫ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.


## ఒకేరోజు అక్కచెల్లెళ్ల పెళ్లి..

**గంటముందు ఇద్దరూ ఆత్మహత్య**



రాజస్థాన్ జోథ్‌పూర్‌లోని ఓ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. ఒకేరోజు పెళ్లి కావాల్సిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు బలవన్మరణానికి పాల్పడటం కలకలం రేపింది. వివాహ ముహూర్తానికి కొన్ని గంటల ముందే వీరిద్దరూ ఆత్మహత్య చేసుకోవడం ఆ కుటుంబంలో తీవ్ర వేదన మిగిల్చింది. జోథ్‌పూర్‌లోని మనై గ్రామానికి చెందిన శోభ (25), విమల (23)ల వివాహం ఒకే రోజు జరిపించేందుకు నిర్ణయించిన కుటుంబ సభ్యులు.. ఫిబ్రవరి 21న ముహూర్తం నిశ్చయించారు. పెళ్లి కోసం ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ముందు రోజు చేసే కార్యక్రమాలు పూర్తయ్యాక ఇద్దరు పెళ్లి కుమార్తెలు నిద్రకు ఉపక్రమించారు. ఈ క్రమంలో తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో వారిద్దరి ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. మృతదేహాలను ఇంటికి తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. ఈమేరకు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పురుగు మందు తాగడంవల్ల ప్రాణాలు కోల్పోయినట్లు ప్రాథమికంగా నిర్ధరించిన పోలీసులు.. పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు మాత్రం తెలియరాలేదు.

# మళ్లీ.. మంటపెట్టిన పిట్రోడా..



కాంగ్రెస్ పార్టీ ఓవర్సీస్ చైర్మన్ శామ్‌పిట్రోడా చేసిన వ్యాఖ్యలు మరోసారి వివాదాస్పదమవుతున్నాయి. ఇతర దేశాలకు సేవ చేసేందుకే భారత నైపుణ్యాలు దోహదపడుతున్నాయని విమర్శలు చేయడం ఇందుకు కారణమైంది. సుమారు 150 కోట్ల జనాభా ఉన్న భారత్‌కు సొంతంగా ఆపరేటింగ్ సిస్టమ్ లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఓ ఇంటర్వ్యూలో పిట్రోడా చేసిన ఈ వ్యాఖ్యలపై భాజపా తీవ్రస్థాయిలో మండిపడింది.

"భారత యువతలో ఎంతో ప్రతిభ ఉంది. వారి నైపుణ్యాలను వినియోగించడంలో భారత్ విఫలమైంది. మన యువతను ఇతర దేశాలు విరివిగా వాడుకుంటున్నాయి. ప్రోగ్రామింగ్, బ్యాంకింగ్, న్యాయశాస్త్రం, పరిశ్రమలు.. ఇలా ఎన్నో రంగాల ఆవిష్కరణల్లో మన యువతే ప్రధాన పాత్ర వహిస్తోంది. సుమారు 150 కోట్ల జనాభా ఉన్న భారత్లో మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీ లేదు. మన ప్రతిభతో కనీసం ఫోనుకు సంబంధించిన ఆపరేటింగ్ సిస్టమ్‌ను తయారు చేయలేకపోయాం" అని పిట్రోడా వ్యాఖ్యానించారు. పిట్రోడా వ్యాఖ్యలపై భాజపా స్పందించింది. ఆయన అబద్ధాలతో భారత్‌ను గతాళి చేస్తున్నారని ఆ పార్టీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు. లినక్స్ (బాస్ లినక్స్), మాయా ఓఎస్, ప్రైమ్ ఓఎస్, భార్ ఓఎస్, ఇండస్ ఓఎస్, నెక్స్ట్ క్వాంటం కంప్యూటింగ్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను భారత్ అభివృద్ధి చేసిందని గుర్తుచేశారు.

# జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

**- ముగ్గురు ఉగ్రవాదులు ఖతం**



జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వాడ్‌లో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులు హతమయ్యారు. వారికి జైషే మహమ్మద్‌తో సంబంధమున్నట్లు అధికారులు వెల్లడించారు. ముగ్గురి మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయని చెప్పారు. భద్రతా ఏజెన్సీల ప్రాథమిక అంచనాల ప్రకారం మృతుల్లో ఒకరిని జైషే మహమ్మద్ కమాండర్ సైపుల్లాగా భావిస్తున్నట్లు తెలిపారు. ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే నిఘావర్గాల సమాచారం ఆధారంగా భద్రతాబలగాలు కిష్త్వాడ్‌లో ఆపరేషన్ ప్రారంభించాయి. ఈక్రమంలోనే చత్రూ బెల్ట్‌లోని పాసెర్కుట్ ప్రాంతంలోని ఓ గుడిసెలో ఉగ్రవాదుల ఆచూకీని గుర్తించాయి. దీంతో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసు కున్నాయి. ముగ్గురు ఉగ్రవాదులను భద్రతాబలగాలు మట్టుబెట్టాయి. గుడిసెలో మంటలు చెలరేగడంతో మృతదేహాలు కాలిపోయాయి. ఘటనాస్థలం నుంచి రెండు ఏకే-47 రైఫిల్స్, ఇతర పేలుడు పదార్థాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. కరడుగట్టిన ఉగ్రవాది సైపుల్లా దాదాపు ఐదేళ్లక్రితం జమ్మూకశ్మీర్‌లోకి చొరబడినట్లు సమాచారం. అప్పటినుంచి స్థానికంగా యాక్టివ్‌గా ఉన్నాడు.2024 జులైలో నలుగురు సైనికుల మృతికి కారణమైన దాడి సహా అనేక ఘటనలకు సూత్రధారి అనే ఆరోపణలున్నాయి. గతంలో అనేక ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించుకున్నాడు. తాజా ఎన్‌కౌంటర్‌తో కలిపి ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఏడుగురు జైషే మహమ్మద్ ఉగ్రవాదులు హతమయ్యారు.



## ఐఐటియన్లకు గుడ్ న్యూస్

**క్రాస్ క్యాంపస్ మొబిలిటీని ప్రవేశపెట్టనున్న కేంద్రం**

ఐఐటీ విద్యార్థులు చాలా కాలంనుంచి ఎదురుచూస్తున్న క్రాస్ క్యాంపస్ మొబిలిటీ త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఈమేరకు దీనిపై ఐఐటీలు నిర్ణయం తీసుకున్నాయి. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. తాజా నిర్ణయం ప్రకారం.. ఇకపై ఐఐటీ విద్యార్థులు ఒక క్యాంపస్‌నుంచి మరో ఐఐటీ క్యాంపస్‌లోకి వెళ్లి చదువుకోవచ్చు. అంటే విద్యార్థులు తమకు నచ్చిన ఐఐటీ సంస్థల్లో చదువుకునే వీలుంటుంది.

ఇప్పటివరకు నచ్చిన ఐఐటీలో చేరాలంటే అంత సులభం కాదు. జేఈఈలో వచ్చిన ర్యాంక్ ఆధారంగా మాత్రమే సీట్లు కేటాయించేవారు. ఎక్కడ సీటు వస్తే అక్కడే చదువుకోవాలి. కానీ, ఇకపై క్రాస్ క్యాంపస్ విధానం ద్వారా విద్యార్థులు ఒక సెమిస్టర్‌ను తమ ఐఐటీ క్యాంపస్ బయట.. మరేదైనా ఐఐటీ క్యాంపస్‌లో చదువుకోవచ్చు. తమ నివాస స్థలానికి దగ్గరగా, తమ సొంత రాష్ట్రంలో చదువుకునే వీలు కూడా దీని ద్వారా దొరుకుతుంది. దీనికి సంబంధించి ఐఐటీ క్యాంపస్‌లు అన్నీ ఇతర విద్యార్థుల్ని అనుమతిస్తాయి. అక్కడ తమ కోర్సును కొనసాగించవచ్చు. హాజరు, పరీక్షలువంటి అంశాల్లో ఇకపై క్యాంపస్‌ల మధ్య సహకారం ఉంటుంది. ఈ నిర్ణయం అమలైతే ఏదో ఒక ఐఐటీలో సీటు సంపాదిస్తే చాలు. నచ్చిన ఐఐటీలో కొంతకాలం చదువుకోవచ్చు. ఈ అంశంపై ఇప్పటికే అనేక ఐఐటీల డీన్లు చర్చలు జరిపి ఏకాభిప్రాయానికి వచ్చారు. ఇంకా కొన్ని అంశాల్లో మాత్రం స్పష్టత రావాల్సి ఉంది. ఈ నిర్ణయాన్ని వచ్చే విద్యా సంవత్సరంనుంచే అమలు చేయనున్నారు.

## కాంగ్రెస్‌వి డర్టీ పాలిటిక్స్

**ఏఐ సమ్మిట్‌లో అర్ధనగ్న ప్రదర్శన దారుణం**

**మేరఠ్ బహిరంగ సభలో ప్రధాని మోదీ**



ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమిట్‌లో శుక్రవారం యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధనగ్నంగా నిరసన చేపట్టడాన్ని ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. గ్లోబల్ ఈవెంట్ ఏఐ సమిట్‌ను కాంగ్రెస్ తన మురికి రాజకీయాలకు వేదికగా మార్చుకుందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. యూపీలోని మేరఠ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఏఐ సమిట్‌లో విదేశీ అతిథులు కూర్చున్న వేదిక వద్దకు కాంగ్రెస్ నాయకులు అర్ధనగ్నంగా వచ్చి గందరగోళం సృష్టించారని తెలిపారు. తమ చర్యలతో కాంగ్రెస్ నేతలు ఇప్పటికే ప్రజల దృష్టిలో దిగజారారని.. ఇంకా ఇటువంటి పనులు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. దేశాన్ని అప్రతిష్టపాలు చేసే పనిలో కాంగ్రెస్ తీరిక లేకుండా ఉందని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా జాతీయ ప్రయోజనాల కోసం చేపడుతున్న కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఈవిధంగా ప్రవర్తించడం సిగ్గుచేటని ప్రధాని విమర్శించారు. రాజకీయ విభేదాలకంటే వారు వ్యక్తిగత శత్రుత్వంపైనే దృష్టి పెడుతున్నారన్నారు. గతంలో తనను, తన తల్లిని అవమానించారని.. ఇప్పుడు ప్రపంచ నేతల ఎదుట దేశాన్ని అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంటే.. కాంగ్రెస్ నేతలు మాత్రం దేశపరువు తీయడానికి చూస్తున్నారని దుయ్యబట్టారు.

**అసలేం జరిగిందెం..?**

ఏఐ ఇంపాక్ట్ సమిట్‌ను లక్ష్యంగా చేసుకొని కాంగ్రెస్ యువజన విభాగమైన 'భారత యువజన కాంగ్రెస్ (ఐవైసీ)' కార్యకర్తలు నాటకీయ రీతిలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఎగ్జిబిషన్ హాలు నంబరు-5లోకి ప్రవేశించిన దాదాపు 15మంది కార్యకర్తలు.. చొక్కాలు విప్పి ఆందోళన చేపట్టారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రానికి, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా నినాదాలు రాసి ఉన్న టీ-షర్టు వారి చేతుల్లో కనిపించాయి. వారి చర్యలవల్ల కొంత సమయం పాటు సమావేశానికి అంతరాయం కలిగింది. అనంతరం భద్రతా సిబ్బంది వారిని కస్టడీలోకి తీసుకున్నారు.

## మెట్రో పిల్లర్‌పై చిక్కుకున్న పిల్లి:

**అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్**

దాదాపు రెండు వారాలుగా మెట్రో పిల్లర్‌పై చిక్కుకున్న పిల్లిని అగ్నిమాపక బృందాలు తీవ్రంగా శ్రమించి కిందకు దించిన ఘటన కేరళలోని కొచ్చిలో చోటు చేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కొచ్చిలోని జవహర్ లాల్ నెహ్రూ మెట్రో స్టేడియం పిల్లర్‌పై రెండు వారాలుగా ఓ పిల్లి చిక్కుకుంది. పిల్లర్లపై పిల్లి బిక్కుబిక్కుమంటూ తిరుగుతుండడాన్ని గమనించిన స్థానికులు జంతు సంరక్షణ బృందానికి సమాచారం ఇచ్చారు. శనివారం ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు మెట్రో సర్వీసులు ముగిసిన తర్వాత రాత్రిపూట విద్యుత్ లైన్‌ను ఆపివేసి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. అయితే పిల్లి ఎక్కడ ఉందనే విషయం గుర్తించలేకపోయారు. ఆదివారం తెల్లవారుజామున ఓ మెట్రో పిల్లర్‌పై పిల్లి ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో రంగంలోకి దిగిన అగ్నిమాపక బృందాలు హైడ్రాలిక్ లిఫ్ట్ ఉపయోగించి.. ఆ పిల్లర్‌పై ఉన్న పిల్లిని వలతో పట్టుకోవడానికి ప్రయత్నించాయి. కాగా పిల్లి వలలోకి రాకుండా తప్పించుకోవడంతో కొన్ని గంటలపాటు శ్రమించి దానిని సురక్షితంగా కిందకు దించారు. 'మంజుమ్మల్ బాయ్స్' సినిమాలో లోయలో జారిపడిపోయిన 'సుభాష్' పేరును స్థానిక ఆటో డ్రైవర్లు ఆ పిల్లికి పెట్టడంతో అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



# ఇరాన్‌లో కదంతొక్కిన విద్యార్థులు



ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇరాన్‌లో ఆందోళనలు ఇంకా చల్లారడం లేదు. ఇప్పటికీ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఇరాన్‌లో వివిధ యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కదం తొక్కారు. ప్రభుత్వాధినేత ఖమేనీకి, అతడి పాలనకు వ్యతిరేకంగా శనివారం నినదించారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్, మషాద్ పట్టణాల్లో విద్యార్థులు, యువత వీధుల్లోకి చేరి నిరసనలు చేపట్టారు.

సుప్రీం లీడర్ ఖమేనీని అంతం చేయాలని, అతడి పాలననుంచి తమకు స్వేచ్ఛ కావాలని, అలాగే ఈ విషయంలో అమెరికా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. స్థానిక షరీఫ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీకి చెందిన విద్యార్థులు ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో పోలీసులు, భద్రతా బలగాలపైకి దూసుకెళ్లారు. వారికి వ్యతిరేకంగా ఉద్యమించారు. ఈ ఉద్యమానికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ఇరాన్‌లో జరుగుతున్న ఆందోళనల్లో వేల మంది మరణించారని అమెరికా సహా అంతర్జాతీయ హక్కుల సంఘాలు ఆరోపించిన సంగతి తెలిసిందే. కానీ, వీటికి ఆధారాలు చూపాలని ఇరాన్ డిమాండ్ చేసింది. అయితే, ఆందోళనల్లో పాల్గొన్న వేలాదిమందిని ఖమేనీ ప్రభుత్వం చంపిందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఇరాన్‌పై అమెరికా దాడులకు సిద్ధమవుతోంది.

# లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి

- హిజ్బుల్లా ఫీల్డ్ కమాండర్ ఖతం
- 10మంది దుర్మరణం.. 50మందికి గాయాలు

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. లెబనాన్‌లోని బెకా లోయ లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. దాడిలో సీనియర్ హిజ్బుల్లా ఫీల్డ్ కమాండర్‌తో సహా 10 మంది మరణించారు. మరో 50 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. నవంబర్ 2024లో రెండు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత జరిగిన అతిపెద్ద దాడి ఇదే కావడం గమనార్హం. కాగా ఘటనపై లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పందించింది. మృతుల్లో సాధారణ పౌరులు కూడా ఉన్నారని, గాయపడిన వారిలో చిన్నారులు ఉన్నారని తెలిపింది. మరణించిన 10 మందిలో ముగ్గురు చిన్నారులు ఉన్నట్టు కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ దాడితో బెకా లోయ ప్రాంతం శోక సంద్రంలో మునిగిపోయింది. మరోవైపు ఈ దాడిని ఇజ్రాయెల్ ధ్రువీకరించింది.



తమపై దాడి చేసేందుకు హిజ్బుల్లా సన్నాహాలు చేస్తున్నట్టు కచ్చితమైన సమాచారం అందడంతోనే ఈ చర్యలు తీసుకున్నామని తెలిపింది. బెకా లోయలోని హిజ్బుల్లా కమాండ్ సెంటర్లను లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే ఈ ఘటనపై హిజ్బుల్లా వైపు నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. తాజా పరిణామంతో ఇరుదేశాల మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరిగే అవకాశం కనిపిస్తోంది.



## అమెరికాలో హిందువులే విద్యాధికులు!

అమెరికాలో అత్యంత విద్యాధిక మతవర్గం హిందువులేనని ప్యూ రీసెర్చ్ సెంటర్ విడుదల చేసిన ఒక సర్వే నివేదిక వెల్లడించింది. యూదులు అత్యంత విద్యాధికుల జాబితాలో రెండోస్థానంలో ఉన్నారు. వివిధ మతవర్గాల స్థితిగతులపై 2023-24లో నిర్వహించిన రిలిజియస్ ల్యాండ్‌స్కేప్ సమగ్ర సర్వే (ఆర్ఎల్ఎస్)లో వెలువడిన గణాంకాల ఆధారంగా ఈ అధ్యయన నివేదిక వెలువరించారు. అమెరికాలో నివసిస్తున్న ప్రతి పదిమంది హిందువుల్లో ఏడుగురు.. అంటే 70శాతం మంది పట్టభద్రులు కాగా.. యూదుల్లో 65శాతం మందికి బ్యాచిలర్స్ డిగ్రీ ఉన్నట్టు గుర్తించారు. అమెరికా మొత్తం జనాభాలో పట్టభద్రులు సరాసరిన 35శాతం మాత్రమే. జాతీయ సరాసరి కన్నా ఎక్కువ శాతం మంది ముస్లింలు, బౌద్ధులు, సనాతన క్రైస్తవులు, సాధారణ ప్రొటెస్టెంట్ క్రైస్తవులు పట్టభద్రులుగా ఉన్నట్టు సర్వేలో తేలింది. ఇవాంజెలికల్ ప్రొటెస్టెంట్లు, కేథలిక్కులు జాతీయ సరాసరి కన్నా తక్కువ సంఖ్యలో పట్టభద్రులైనట్టు వెల్లడైంది. హిందువులు, ముస్లింలు, బౌద్ధుల్లో అత్యధికులు ఉన్నత విద్యాభ్యాసం కోసమే అమెరికాకు వస్తున్నందున వారిలో పట్టభద్రుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు సర్వే తెలియజేసింది. దీనికోసం 2023-24 మధ్య 36,908 మందిని ప్రశ్నించారు.

## ట్రంప్ ఎస్టేట్‌లో నక్కిన దుండగుడి కాల్చివేత

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నివాసంలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఫ్లోరిడాలో ఉన్న ఆయన నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడటం కలకలం రేపింది. దీంతో వెంటనే స్పందించిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు అతడిని హతమార్చారు. ఈ ఘటన సమయంలో ట్రంప్ దంపతులు వైట్ హౌస్‌లోనే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఫ్లోరిడా పామ్ బీచ్‌లో ఉన్న 'మార్ ఎ లాగో' ఎస్టేట్‌కు అధ్యక్షుడు ట్రంప్ వారాంతంలో వస్తుంటారు. ఇక్కడ కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. శనివారం అర్ధరాత్రి సమయంలో ఓ దుండగుడు ఎస్టేట్ నార్త్ గేట్‌నుంచి ప్రవేశించాడు. అతడి చేతిలో ఆయుధంతోపాటు ఇంధనం క్యాన్ ఉన్నట్లు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమై మట్టుబెట్టినట్లు సీబీఐతోపాటు పామ్ బీచ్ పోలీసులు వెల్లడించారు. అతడి వయసు 20నుంచి 25 మధ్య ఉండవచ్చని.. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హత్యకు గతంలోనూ ప్రయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. 2024 జులైలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనపై హత్యాయత్నం జరిగింది. ఆ ఘటనలో మరణం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. అనంతరం కొన్ని నెలలకు.. పామ్ బీచ్ గోల్ఫ్ కోర్సులో రైఫిల్ అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తినీ పోలీసులు అరెస్టు చేశారు.





## ఆఫ్ఘాన్ నివాసాలపై పాక్ దాడులు

**ఆత్మాహుతి దాడులకు ఇది ప్రతీకారమేనన్న పాక్**

ఉగ్రవాదులే లక్ష్యమని చెప్పి ఆఫ్ఘానిస్థాన్‌పై పాకిస్థాన్ దాడులకు పాల్పడింది. పాకిస్థాన్-ఆఫ్ఘానిస్థాన్ సరిహద్దుల్లోని నివాస ప్రాంతాలపై ఈ దాడులు నిర్వహించింది. దాడుల్లో పలువురు ఆఫ్ఘాన్ పౌరులు మృతిచెందారు. ఇటీవల తమ దేశంలో జరిగిన ఆత్మాహుతి దాడులకు ప్రతీకారంగా ఈ దాడులు నిర్వహించినట్టు పాకిస్థాన్ పేర్కొంది.. నంగర్హార్, పాక్టికా ప్రావిన్స్‌లలో శనివారం అర్ధరాత్రి దాటాక దాడులు జరిగాయి. తమ పౌరుల నివాసాలపై పాకిస్థాన్ బాంబులతో దాడి చేసిందని, ఈ ఘటనలో డజన్ల కొద్దీ చనిపోయారని ఆఫ్ఘాన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ చెప్పారు. గాయపడిన వారిలో మహిళలు, చిన్నారులు ఉన్నారని తెలిపారు. ఈ దాడి ఘటనను పాకిస్థాన్ ధ్రువీకరించింది. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ఏడు టెర్రరిస్ట్ క్యాంపులపై దాడులు చేపట్టినట్లు ఆ దేశ సమాచారశాఖ మంత్రి తరార్ ఎక్స్‌లో పోస్టు చేశారు. అంతేకాకుండా ఐసిస్ అనుబంధ గ్రూప్‌పై సైతం దాడి చేసినట్లు తరార్ పేర్కొన్నారు. ఇటీవల ఇస్లామాబాద్‌లో మసీద్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిని తామే చేసినట్లు ఐసిస్ ప్రకటించుకుంది. ఈ ఘటనలో 31 మంది పాక్ పౌరులు మృతి చెందగా, 161 మంది గాయపడ్డారు.

# సుప్రీం తీర్పు ఎఫెక్ట్:

**భారత్-అమెరికా చర్చలు రీషెడ్యూల్**



భారత్-అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారైన సంగతి తెలిసిందే. ఈ డీల్‌కు చట్టబద్ధంగా తుదిరూపును ఖరారు చేసేందుకు సోమవారం జరగాల్సిన చర్చలు వాయిదా పడ్డట్లు సమాచారం. వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు ఫిబ్రవరి 23నుంచి 3 రోజులపాటు వాషింగ్టన్‌లో ఇరుదేశాల ప్రతినిధులు సమావేశం కావాల్సి ఉంది. కాగా ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు నేపథ్యంలోనే ఈ చర్చలను రీషెడ్యూల్ చేసినట్టు తెలుస్తోంది. ఇరు దేశాలకు అనుకూలమైన తేదీలలో ఈ చర్చలను తిరిగి నిర్వహించనున్నట్టు విదేశాంగ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ ప్రకటనను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్లను అక్కడి సుప్రీంకోర్టు ఇటీవల రద్దు చేసింది. టారిఫ్‌లు చెల్లవంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తీర్పు వచ్చిన కొన్ని గంటల్లోనే ప్రపంచ దేశాలపై 10శాతం సుంకాలు విధించిన ఆయన.. తాజాగా వాటిని 15శాతానికి పెంచుతున్నట్టు ప్రకటించారు. ఇవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. మున్ముందూ చట్టబద్ధమైన టారిఫ్లను జారీ చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో అగ్రరాజ్యంతో భారత్ చేసుకొన్న ట్రేడ్ డీల్‌లో మార్పులు జరిగే అవకాశం ఉంది.

చైతన్య రథం
సినిమా
సోమవారం 23 ఫిబ్రవరి 2026 VIII

## సమంత సినిమా డేట్ వచ్చేసింది..



స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' విడుదల తేదీ ఎట్టకేలకు ఖరారైంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని వేసవి కానుకగా మే 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. సుదీర్ఘ విరామం తర్వాత సమంత తెలుగు వెండితెరపై కనిపిస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో ఆమె ఒక మధ్యతరగతి ఇల్లాలి పాత్రలో కనిపిస్తూనే, ఆకట్టుకునే యాక్షన్ సీక్వెన్స్‌లలో నటించడం విశేషం. గతంలో 'ఓ బేబీ' వంటి సూపర్ హిట్ అందించిన దర్శకురాలు నందినిరెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, సమంత తన సొంత నిర్మాణ సంస్థ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై దీనిని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరు కథ అందించగా, సంతోష్ నారాయణన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. సినిమాలో గుల్షన్ దేవయ్య, దిగంత్, గౌతమి, శ్రీముఖివంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సమంత తన సోషల్ మీడియా వేదికగా "యాక్షన్ ప్యాక్ట్ గోల్డెన్ హంట్ –ఈ వేసవికి థియేటర్లలో కలుద్దాం" అంటూ కొత్త పోస్టర్‌ను పంచుకోవడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపయ్యింది. వేసవి సెలవులను టార్గెట్ చేస్తూ వస్తున్న సినిమా సమంత కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

### అట్టహాసంగా
## 'జై హనుమాన్'

సెన్సేషనల్ హిట్టయిన మొదటి సూపర్ హీరో చిత్రమే "హను మాన్". దర్శకుడు ప్రశాంత్ వర్మ, యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో తేజ సజ్జ కలయికలో వచ్చిన చిత్రం పాన్ ఇండియా లెవెల్లో దుమ్ము లేపింది. సంక్రాంతి బరిలో అప్పటికి రికార్డు గ్రాసర్‌గా కూడా నిలిచిన ఈ సినిమాకి సీక్వెల్ "జై హనుమాన్" ఎప్పుడెప్పుడు మొదలవుతుందా? అని అభిమానులు ఎదురు చూస్తుండగా ఎట్టకేలకి ఆ సమయం రానే వచ్చింది. నేడు రిషబ్ శెట్టి, బాలీవుడ్ నిర్మాతలు భూషణ్ కుమార్ అలాగే అనిల్ తడానీ ఇంకా మైత్రి నిర్మాతల కలయికలో అంజనాద్రి, హంపీలో ఎంతో



అట్టహాసంగా, పరిపూర్ణ భక్తి శ్రద్ధలతో కార్యక్రమాన్ని మేకర్స్ నిర్వహించారు. కార్యక్రమంలో హను మాన్ హీరోలు తేజ సజ్జ, రిషబ్‌శెట్టితో పాటుగా దర్శకుడు ప్రశాంత్ వర్మ కూడా పాల్గొనడం జరిగింది. అయితే ఇందులో భూషణ్ కుమార్ ఫస్ట్ షాట్‌కి క్లాప్ కొట్టగా అనీల్ తడానీ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. అలాగే ఈ ఫస్ట్ షాట్‌ని తమ సూపర్ హీరో తేజ సజ్జ దర్శకత్వం వహించినట్టు మైత్రి వారు తెలిపారు. ఇలా ఎట్టకేలకి ఈ అవైటెడ్ సీక్వెల్ సినిమా మొదలైంది. మరి ఎప్పటికి పూర్తయ్యి రిలీజ్‌కి వస్తుందో వేచి చూడాలి.

## పీపుల్స్ మీడియాతో మళ్లీ..



ప్రభాస్ రీసెంట్‌గా రాజాసాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. టాలీవుడ్ టాప్ లీడింగ్ బ్యానర్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తెరకెక్కించిన ఈ చిత్రం బాక్సాఫీస్ ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయింది. భారీ అంచనాల మధ్య విడుదలైన మూవీ పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి నిరాశనే మిగిల్చింది. ఇదిలా ఉంటే ప్రభాస్ మరోసారి ఇదే బ్యానర్‌లో సినిమా చేసేందుకు రెడీ అవుతున్నాడన్న వార్త ఒకటి నెట్టింట హల్‌చల్ చేస్తోంది. ఫెయిల్యూర్ తర్వాత ప్రభాస్ నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌ను కలిసి మరో సినిమా చేస్తానని హామీనిచ్చాడట. బాక్సాఫీస్ ఫలితాలతో సంబంధం లేకుండా ప్రభాస్ తీసుకున్న ఈ నిర్ణయం మరోసారి తన గొప్ప మనసును చాటుతోంది. ప్రభాస్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ రీయూనియన్ ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుందట. మరి ఈ సినిమాను డైరెక్ట్ చేయబోయేది ఎవరో..? ప్రభాస్ స్టార్‌డమ్‌కు తగ్గకుండా ఎలివేట్ చేసేలా ఈ కొత్త ప్రాజెక్టు ఉండాలని ఆశిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎప్పుడెప్పుడు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఉంటుందా..? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్. ప్రభాస్ ఖాతాలో ప్రస్తుతం సలార్–2తోపాటు ఫౌజీ, స్పిరిట్ సినిమాలున్నాయి.

## లెనిన్‌పై కొత్త అప్‌డేట్




అక్కినేని యంగ్ హీరో అఖిల్ ప్రస్తుతం తన లెనిన్ చిత్రాన్ని దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరి (నందు) డైరెక్షన్‌లో చేస్తున్నాడు. కాగా ఈ సినిమా క్లైమాక్స్‌ను ఇప్పటికే షూట్ చేశారు. అయితే, వచ్చేవారంనుంచి సినిమాలోని ప్యాచ్ వర్క్‌ను షూట్ చేయడానికి టీమ్ ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది. ఈ షూట్‌లో అఖిల్‌తోపాటు మిగిలిన తారాగణం కూడా జాయిన్ అవుతుందట. ఇక ప్రస్తుతం టీమ్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌ను శరవేగంగా పూర్తి చేసే పనిలో ఉంది. కాగా ఈ సినిమా.. రాయలసీమ బ్యాక్ డ్రాప్‌తో చిత్తూరు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కుతుంది. ఇక ఈ సినిమాలో అందాల భామ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక సినిమాపై భారీ అంచనాలున్నాయి. ముఖ్యంగా అఖిల్ –భాగ్య శ్రీ కలయికలో లవ్ సీన్స్ చాలా బాగుంటాయట. ఈ సినిమాపై అఖిల్ చాలా హోప్స్ పెట్టుకున్నాడు. సినిమా అవుట్ పుట్ అయితే బాగా వస్తోందని టీమ్ చెబుతుంది. మరి ఈ సినిమాతో అఖిల్ హిట్ కొడతాడో లేదో చూడాలి.

## కల్కి సీక్వెల్ మొదలైందా?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన "కల్కి 2898 ఏడీ" బ్లాక్ బస్టర్ హిట్‌ను సాధించింది. అటు కలెక్షన్స్ లోనూ సరికొత్త రికార్డ్స్‌ను క్రియేట్ చేసింది. అయితే, దీనికి కొనసాగింపుగా 'కల్కి–2' రానున్న విషయం తెలిసిందే. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సీక్వెల్ ఇంట్రెస్టింగ్ అప్‌డేట్స్‌తో మళ్ళీ వార్తల్లోకి వచ్చింది. ఈ చిత్రం షూటింగ్ స్టార్ట్ అయిందని.. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతుందని.. శంకర్‌పల్లిలో నిర్మించిన సెట్‌లో అమితాబ్ బచ్చన్ మరియు కమల్ హాసన్ పాత్రలపై కీలక సన్నివేశాలు షూట్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సినిమాలో మొదట దీపిక పదుకోణే హీరోయిన్‌గా నటించింది. అయితే, ఆమె ఈ సినిమానుంచి తప్పుకుంది. మరి ఇప్పుడు ఆమె స్థానంలో ఏ హీరోయిన్ ఫైనల్ అవుతుందో చూడాలి. 'కల్కి సీక్వెల్‌'కు 'కర్ణ 3102 బీసీ' అనే టైటిల్‌ను ఖరారు చేస్తున్నారని టాక్. పైగా ఈ సీక్వెల్‌లో పురాణాల లెంగ్త్ ఎక్కువగా ఉంటుందట. ఎలాగూ కల్కి ఎండింగ్‌ను కూడా కర్ణుడు పాత్రపై ముగించారు కాబట్టి, కల్కి సీక్వెల్ మొత్తం కర్ణ పాత్ర చుట్టూ తిరుగుతుందనే అనుకోవాలి.



### ఫుల్ స్వింగ్‌లో
## కాంచన-4

సౌత్ సినిమా దగ్గర హారర్ కామెడీ సినిమాలకి ఒక ట్రెండ్ సెట్ చేసిన చిత్రాల్లో దర్శకుడు రాఘవ లారెన్స్ స్టార్ట్ చేసిన ముని సిరీస్ ఒకటి. ఇందులో భాగంగా వచ్చిన "కాంచన" ఫ్రాంచైజ్‌కి మంచి రెస్పాన్స్ ఉంది. ఇలా ఎంతో కాలం నుంచి ప్లాన్ చేస్తున్న సినిమానే కాంచన–4. ఈసారి మరింత గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్న ఈ హారర్ కామెడీ కొన్నాళ్ల కితం షూటింగ్ మొదలు పెట్టుకుంది. ఒకపక్క హీరోగా సినిమాలు చేస్తూనే రాఘవ లారెన్స్ ఈసినిమాని కూడా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఇక లేటెస్ట్‌గా ఈ సినిమా నటుడు శ్రీమాన్ సెట్స్‌నుంచి కొన్ని ఫోటోలు షేర్ చేయడం వైరల్‌గా మారింది. దీనితో చాలా రోజుల తర్వాత ఈ సినిమాపై అభిమానులకి ఓ క్లారిటీ వచ్చింది అని చెప్పొచ్చు. ఇక ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా బాలీవుడ్ బ్యూటీ నోరా ఫతేహి కూడా నటిస్తుంది. అలాగే భారీ బడ్జెట్‌తో ఈ హారర్ సినిమాని సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది.



## ముగిసిన జోర్డాన్ షెడ్యూల్

ప్రశాంత్ నీల్ –ఎన్టీఆర్ కలయికలో రాబోతున్న సినిమాపై లేటెస్ట్ అప్ డేట్ వచ్చింది. హై-యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించడానికి చిత్ర బృందం జోర్డాన్‌కి వెళ్ళిన సంగతి తెలిసిందే. అయితే, కొన్ని తెలియని కారణాల వల్ల చిత్ర బృందం ఊహించిన దానికంటే ముందుగానే షూటింగ్ ముగించాలని ప్లాన్ చేసుకుంది. అనుకున్నట్టుగానే తాజాగా జోర్డాన్‌లో షూటింగ్ ముగిసింది. జూనియర్ ఎన్టీఆర్ ఈ ఉదయం జోర్డాన్ నుండి తిరిగి వస్తూ హైదరాబాద్ విమానాశ్రయంలో కనిపించారు. భారీస్థాయిలో, భారీ



బడ్జెట్‌తో తెరకెక్కుతున్న సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. కాగా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న సినిమాలో యాక్షన్ అద్భుతంగా ఉంటుందట. పైగా ఈ సినిమాని ఎన్టీఆర్ కెరీర్‌లోనే అత్యుత్తమ సినిమాల్లో ఒకటిగా చేయాలని ప్రశాంత్ నీల్ ప్రయత్నం చేస్తున్నాడట. అందుకే, ఈ సినిమా స్క్రిప్ట్ కోసం ప్రశాంత్ నీల్ చాలా టైమ్ తీసుకున్నాడు. కాబట్టి, ఇప్పటి వరకూ ప్రశాంత్ నీల్ తీసిన అన్ని సినిమాల్లోకల్లా బెస్ట్ సినిమా ఇదే అవుతుందని అంచనాలున్నాయి. ఈ చిత్రంలో అనిల్ కపూర్ కీలక పాత్ర పోషిస్తున్నారు.